జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 14, జూన్ 2024 ‖ ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం




## సీఎం పేషీలో బాబు

**అమరావతి,మహానాడు:**
ఏపీ ముఖ్యమంత్రిగా నిన్న ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్‌లో సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు చేపట్టారు. ముఖ్య మంత్రి హెూదాలో 5 ఏళ్ల తరువాత సచివాలయానికి వచ్చిన చంద్రబాబు నాయుడుకి రాజధాని రైతులు అత్యంత ఘనమైన స్వాగతం పలికారు. వేల మంది రోడ్ల మీదకు వచ్చి....రాహదారులు అన్నీ పూలమయం చేసి ముఖ్యమంత్రిపై అభిమానం చాటారు. అలాగే సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# హెూదా కోరాలట...

# హాహాహా వావావా !



- జగన్ పలుకులపై సోషల్‌మీడియాలో జజ్జనకరిజనారే
- ఐదేళ్లూ గాడిదలు కాశారా అని నెటిజర్ల ఫైర్
- కేసుల కోసం మోదీకి మోకరిల్లారంటూ ధ్వజం
- సిగ్గులేని మాటలెందుకని అక్షింతలు
- ఓడినా సిగ్గురాలేదని విమర్శలు

(మార్తి సుబ్రహ్మణ్యం)

వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి మెదడు మోకాల్లోకి వచ్చినట్లుంది. ఆయన తెలివి తెల్లారినట్లుంది. 11 సీట్లతో జనం పంగనామాలు పెట్టినా ఇంకా గతితప్పిన మతిలేని రాజకీయాన్నే నమ్ముకున్నట్లుంది. సినిమా యాక్టర్లకు ఎగ్గుండదు. రాజకీయ నాయకులకు సిగ్గుండదన్న సినిమా సామెతను జగన్ నిజం చేస్తున్నట్లుంది. ఎవరైనా ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటారు. ఎందుకు ఓడి

కామెంట్



పోయామో పోస్టుమార్టం చేసుకుంటారు. కానీ జగన్ తీరు అందుకు విరుద్ధం. ఎందుకంటే ఆయన జగన్ కదా?

నవ్విపోదురుగాక..నాకేటిసిగ్గన్నట్లుంది జగన్‌రెడ్డి నిర్వాకం! కొత్త ప్రభుత్వం ప్రమాణం చేసి ఇంకా ముచ్చటగా మూడురోజులు కూడా కాలేదు. ఇది రాసే సమయానికి మంత్రులకు ఇంకా శాఖలు కూడా కేటాయించ లేదు. ఈలోగా జగన్ ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. శ్రీకృష్ణుడు అర్జనుడికి ఉపదేశం ఇచ్చిన మాదిరిగా, జగన్ కూడా తన పార్టీ ఎమ్మెల్సీలకు అనుగ్రహభాషణం చేశారు. బాగానే ఉంది. తప్పులేదు. పరాజయ ప్రస్థానంలో ఎవరి దారి వారు చూసుకునే ఎమ్మెల్సీలు దారి తప్పకుండా, దారిలో పెట్టడం నాయకుడిగా ఆయన కర్యవ్యం.

కానీ ఆ సందర్భంలో జగన్ ప్రత్యేక హెూదాపై చేసిన వ్యాఖ్యలు వికృతంగా, అతి తెలివిగానే అర్ధమవుతాయి. ఎన్డీయే తన చేతిలో ఉన్నందున, ప్రత్యేక హెూదా అడగకపోవడం చంద్రబాబు చేసిన పాపమట. అలా అడగకపోతే యువకులు బాబుకు క్షమించరట. ఇదీ ఆయన వాదన. ఓటమితో జగన్ మానసిక సమతుల్యం దెబ్బతిందా? లేక అతి తెలివి రాజకీయాలు పరాకాష్ఠకు చేరాయా? అదీకాకపోతే.. బుర్రబుద్ధిలేని ఆయన బృహస్పతుల స్క్రిప్టు'ను ఇంకా చదువుతున్నారా? అన్న అనుమానం ఎవరికైనా రాక తప్పదు.

అసలు జగన్ ప్రత్యేక హెూదా గురించి మాట్లాడటమే పెద్ద బూతు. ఎందుకంటే ఐదేళ్లు అధికారం వెలగబెట్టినప్పుడు, ఆయన అఘోరించేదేమిటి? రాష్ట్రపతి ఎన్నికల్లో పువ్వుపార్టీ తన మద్దతు అడిగినప్పుడు, ఈ 'అతి'తెలివి అప్పుడేమైంది? 'మాకు ప్రత్యేక హెూదా ఇవ్వకపోతే మేం మీకు మద్దతునివ్వం' అని ఆనాడు ఎందుకు షరతులు పెట్టలేకపోయారు? ఎందుకు పెట్టలేదంటే.. బెయిల్‌పై బయట తిరుగుతున్న జగన్ సీబీఐ కేసులకు ఆయన ప్రతి శుక్రవారం హాజరుకావలసి వస్తుంది కాబట్టి!

అప్పుడు నిజంగా హెూదాకు- మద్దతుకు మెలికపెట్టి ఉంటే, ఆంధ్రాకు అప్పుడే హెూదా వచ్చేది కదా? మరి అప్పుడు జగన్ తెలివి తెల్లారలేదా? ఆరోజు గుడ్డిగుర్రం పళ్లు తోముతున్నారా? ఈ అతి తెలివి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులకు, బేషరతుగా మిగతా..2లో





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జపాన్ రాయబారి సుజుకి హిరోషి.





## తొలి 'జన సంతకం'!

- ప్రజల సమక్షంలో ఫైళ్లపై చంద్రబాబు నాయుడు సంతకాలు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 5 అంశాలపై తొలి రోజు సంతకాలు
- లబ్దిదారులు, సాధారణ ప్రజల సమక్షంలో ఫైళ్లపై సంతకాలు
- 16,347 టీచర్ పోస్టుల భర్తీపై ముఖ్యమంత్రి తొలి సంతకం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్లు రూ.4 వేలకు పెంపుపై మూడో సంతకం
- యువత నైపుణ్య గణన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైళ్లపై సంతకాలు చేసిన సీఎం
- సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రిగా నిన్న ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్‌లో సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు చేపట్టారు. వేదపండితులు పూజల నిర్వహించిన అనంతరం చంద్రబాబు నాయుడు బాధ్యతలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రి హెూదాలో 5 ఏళ్ల తరువాత సచివాలయానికి వచ్చిన చంద్రబాబు నాయుడు కి రాజధాని రైతులు అత్యంత ఘనమైన స్వాగతం పలికారు. వేల మంది రోడ్ల మీదకు వచ్చి....రాహదారులు అన్నీ పూలమయం చేసి ముఖ్యమంత్రి పై అభిమానం చాటారు. అలాగే సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### మెగా డిఎస్సీపై తొలి సంతకం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే ఫైళ్లపై సంతకాలు చేశారు. ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసంతకం చేశారు. మొదటి హామీ అయిన మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టిన ముఖ్యమంత్రి మిగతా..3లో




## రేవంత్‌రెడ్డిగారూ..
## మీ పాలన అధ్వానం

- పగ, ప్రతీకారాలతో మీ పాలన అధ్వానం
- తెలంగాణ సీఎం, రేవంత్‌రెడ్డికి హైదరాబాద్ బీఆర్ఎస్ ఇన్చార్జి దాసోజు శ్రవణ్ బహిరంగలేఖ

**హైదరాబాద్:** నిత్యం పగ-ప్రతీకారాలతో రేవంత్ రెడ్డి పాలన అధ్వానంగా మారిందని బీఆర్ఎస్ హైదరాబాద్ ఇన్చార్జి మిగతా..2లో

## హరీశ్ రావుకు త్వరలో నోటీసులు

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ ఏజెన్సీలను అఫిడవిట్ ఫైల్ చేయమని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్ స్పష్టం చేశారు. ఆ అఫిడవిట్లపై విచారణ కొనసాగుతోందని వివరించారు. టెక్నికల్ అంశాలు సిద్ధమైన తర్వాత ప్రజా ప్రతినిధులకు నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు.



ఆ తర్వాత భారీ నీటిపారుదల శాఖా మంత్రి, ముఖ్యమంత్రిని విచారణకు పిలుస్తామని వెల్లడించారు. జూలై రెండో వారం లేదంటే ఆ తర్వాత విచారణకు పిలుస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ మిగతా..2లో



గాడి తప్పిన వ్యవస్థలను

## దారిన పెడతా..

- ఏం చేశారో మీరే ఆత్మవిమర్శ చేసుకోండి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- సచివాలయంలో ముఖ్యమంత్రికి అధికారుల శుభాకాంక్షలు

**అమరావతి:**
ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడుకి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారికి ధన్యవాదాలు తెలిపిన సిఎం.. కొద్దిసేపు వారితో మాట్లాడారు. మిగతా..2లో

## సంస్థాగత నిర్మాణంపై దృష్టి



- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

**విజయవాడ:**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర స్థాయిలో నాలుగు విభాగాలుగా సమీక్ష నిర్వహించింది. సుమారు ఎనిమిది గంటల పాటు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ జీ సమక్షంలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. మిగతా..2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 14, జూన్ 2024


## రేవంత్‌రెడ్డిగారూ.. మీ పాలన అధ్వానం

(మొదటిపేజీ తరువాయి..)

చాలా అద్వాన్నంగా మారింది. విద్యుత్ లోటుతో సతమతమవుతున్న రాష్ట్రాన్ని, మిగులు విద్యుత్తు అందించి వెలుగులు విరజిమ్మే తెలంగాణగా తీర్చిదిద్దినందుకు కేసీఆర్ కి సంజాయిషీ నోటీసులా??

తెలంగాణ రైతాంగానికి 24 గంటలు ఉచిత విద్యుత్తు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు సంజాయిషీ నోటీసులా??

ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు నిరంతర విద్యుత్తు సరఫరా చేసి, అభివృద్ధికి దారితీసినందుకు సంజాయిషీ నోటీసులా??

రేవంత్ రెడ్డి, మీ ప్రతీకార రాజకీయాలను ప్రక్కనపెట్టి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయండి.

గత ప్రభుత్వంలో మాదిరిగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, అభివృద్ధిని అడ్డుకునే మీ దుష్ప్రయత్నాలను విరమించండి.

కేసీఆర్ నాయకత్వంలో వెలుగులు విరజిమ్మిన రాష్ట్రం, కరెంట్ లోటుతో సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితిని మీ ప్రతీకార రాజకీయాలతో మరింత కష్టతరం చేయడం సరికాదు.

హామీల అమలు చేతకాని గుంపుమేస్త్రీగా డివర్షన్ పాలిటిక్స్ చేస్తూ సంజాయిషీల ప్రతీకార రాజకీయాలకు మీరు తెరలేపారు.

రుణ మాఫీ, రైతు భరోసా, ఉద్యోగాలు. 4 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, మహిళకు 2500 రూపాయలు లాంటి పథకాలు అమలు చెయ్య మీకు చేతకాక, కేసీఆర్ ను బద్నాం చెయ్యాలని చూస్తున్నారు..

ఈ సమయంలో, రాజకీయ కుయుక్తులను పక్కనపెట్టి, రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మీ ఆలోచనలు, కృషిని కేంద్రీకరించండి.

మీ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ఆకాంక్షలను, వారి అభివృద్ధిని అణగదొక్కే ప్రయత్నాలను విరమించండి.

ఇట్లు
డా. దాసోజు శ్రవణ్

## హరీశ్ రావుకు త్వరలో నోటీసులు

(మొదటిపేజీ తరువాయి..)

మంత్రి హరీశ్ రావుకు త్వరలో నోటీసులు అందే అవకాశం ఉంది.

అంతకుముందు కాళేశ్వరం కమిషన్‌ను హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజనీర్లు కలిశారు. మధ్యంతర నివేదిక రెండు వారాల్లో సమర్పించాలని నిపుణులకు కమిషన్ స్పష్టం చేసింది. పూర్తిస్థాయి నివేదిక వీలయినంత త్వరగా అందజేయాలని రెండు కమిటీల ఇంజనీర్లకు కాళేశ్వరం కమిషన్ సూచించింది.

టెక్నికల్ అంశాలకు సంబంధించిన విషయంలో అఫిడవిట్ ఫైల్ చేయాలని నిపుణుల కమిటీలకు కాళేశ్వరం కమిషన్ సూచించింది. త్వరలో మరోసారి ఫీల్డ్ విజిట్ చేస్తామని జస్టిస్ చంద్ర ఘోష్ వివరించారు.

అఫిడవిట్ దాఖలు చేసిన ప్రతి ఒక్కరిని బహిరంగ విచారణలో భాగస్వామ్యం చేస్తామని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ చంద్ర ఘోష్ స్పష్టం చేశారు. విజిలెన్స్ రిపోర్ట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కమిషన్ ఇప్పటికే కోరింది. విజిలెన్స్ రిపోర్ట్ అందకపోవడంతో మరోసారి ప్రభుత్వానికి లేఖ రాయనుంది.

## హెూదా కోరాలట... హ్హాహ్హాహ్హా !

(మొదటిపేజీ తరువాయి..)

మద్దతు ఇచ్చినప్పుడు ఉంటే, మన యువకులు మురిసిముక్కలయ్యేవాళ్లు కదా?


ఈ అతి తెలివోదో ఉప రాష్ట్రపతి, స్పీకర్ ఎన్నికల్లో చూపించి ఉంటే హెూదా దక్కును కదా? అప్పుడు నవ రంధ్రాలూ మూసుకుని, కేసుల కోసం హెూదాను తాకట్టు పెట్టి, ఇప్పుడు హెూదా గురించి మాట్లాడితే నలుగురూ న వ్వుతారన్న జ్ఞానం కూడా లేకపోతే ఎలా? ఇంత సిగ్గుమాలిన తనం, సిగ్గులేని రాజకీయాలు చేస్తే యువ కులు క్షమిస్తారా?.. అన్నది ఇప్పుడు సోషల్‌మీడియాలో నెటిజన్లు సంధిస్తున్న ప్రశ్నలు.

నిజానికి ఈ ప్రశ్నలకు, జగన్ అర్హుడే అన్నది బుద్ధి జీవుల అభిప్రాయం. అప్పుడు లోక్‌సభలో జగన్ పార్టీ అవసరం లేకపోయినా రాజ్యసభలో మాత్రం అవసరం. రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి, ఎలక్టోరల్ కాలేజీలో దండిగా ఓట్లున్న జగన్ పార్టీ అవసరం బీజేపీకి ఉంది.

అప్పుడు పువ్వుపార్టీని నిలదీసి.. నిగ్గదీసి హెూదా ఇస్తావా? చస్తావా? అని కడిగేసే సమయమది. హెూదా ఇవ్వ పోతే యుపిఏ అభ్యర్థికి ఓటు వేస్తామని బెదిరించే సందర్భమది. నిజంగా జగన్ ఈ అతి తెలివి అప్పుడే బీజేపీ దగ్గర ప్రదర్శించి ఉంటే, ఈపాటికి హెూదా వచ్చేది. హెూదా తెచ్చిన వీరుడిగా జగన్‌కు జనం బ్రహ్మరథం పట్టేవారు. అప్పుడు ఈ దిక్కుమాలిన పరిస్థితి ఉండేది కాదు.

అప్పుడు ఆ పని చేయకుండా, ఇప్పుడు తీరికూర్చుని అతి తెలివి రాజకీయాలు చేసే, టీడీపీకి–కూటమికి వచ్చిన గత్తరేమీ లేదు. ఎందుకంటే ఈ ఎన్నికల్లో ప్రత్యేక హెూదా అజెండా కాదు. కాంగ్రె స్ మినహాయిస్తే, జగన్ సహా ఎవరూ ప్రత్యేక హెూదాపై హామీలివ్వలేదు. కాబట్టి ఇప్పుడు హెూదాను ప్రస్తావించి, భావోద్వేగం రెచ్చగొట్టాలన్న జగన్ 'చావు కమ్ అతి తెలివి' రాజకీయాలు, వర్కవుట్ కాదన్నది బుద్ధిజీవుల ఉవాచ.

అసలు జనం తనపై ఎందుకు తిరుగుబాటు చేశారు? తనను పరదాల చాటున ఎందుకు బందీ చేశారు? మతిలేని వారిచ్చిన గతి తప్పిన సలహాలు తానెందుకు పాటించాను? తన తల్లి–చెల్లి తనకు జమిలిగా ఝలక్ ఇచ్చి ఎందుకు వెళ్లారు? 'శివగామి' కుటుంబచ ట్రంలో తానెందుకు ఇరుక్కుపోయాను? మంత్రులు–ఎమ్మెల్యేలకూ అపాయింట్ మెంట్లు ఇవ్వనంత అహంకారం తన తలకు ఎందుకు ఎక్కింది? అసలు తానొక రాజునని, అంతకుమించి తానొక దైవాంశ సంభూతుడినన్న పిచ్చి భ్రమల్లో ఎందుకు బతుకుతున్నాను? ఐదేళ్లు పరదాలు కట్టుకుని ఎందుకు బతికాను? ఇలా ఇంకా ఎన్నో.. ఎన్నెన్నో ఆత్మపరిశీలకు అర్హమైన ప్రశ్నలు .. అద్దం ముందు వేసుకుని, మారు మనసుతో పరిశుద్ధుడిలా పైకి తేలకుండా.. ఇలాంటి సిగ్గుమాలిన రాజకీయాలు ఇంకా కొనసాగించడమే దౌర్భాగ్య మన్నది, సొంత పార్టీ నేతల హితవు. జగనన్నా.. మీకు అర్ధమవు తోందా? లాస్ట్‌బట్ లీస్ట్.. అదేదో సినిమాలో రజనీకాంత్ చెప్పినట్లు.. అతిగా ఆశపడే మగవాడు.. అతిగా ఆవేశపడే ఆడది సుఖపడినట్లు చరిత్రలో లేదు.



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చంద్రబాబు నాయుడును అభినందించిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ కంభంపాటి రామమోహన్ రావు.



**మూర్ము, కిషన్ రెడ్డితో విద్యాసాగర్ భేటీ**

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి, త్వరలో హైదరాబాదులో జరుగబోయే ఒక ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని కోరారు.






## 'బండి'కి ముబారక్..



కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బండి సంజయ్ ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.

బండి సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీ బీవీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్ రెడ్డి, సంకినేని వేంకటేశ్వర రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి, సుభాష్ తదితరులు





## కొత్త ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం


నూతనంగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నవీన్ కుమార్ రెడ్డి (మహబూబ్ నగర్ స్థానిక సంస్థల కోటాల), తీన్మార్ మల్లన్న (వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ కోటా)తో శాసన మండలిలోని తన ఛాంబర్‌లో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.



## గాడి తప్పిన వ్యవస్థలను దారిన పెడతా..

(మొదటిపేజీ తరువాయి..)

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "1995లో నేను మొదటి సారి సీఎం అయ్యాను. నాడు నాతో పని చేసిన వారిలో కొందరు నేడు ఇక్కడ ఉండి ఉంటారు. నాలుగో సారి ఇప్పుడు సీఎంగా బాధ్యతలు తీసుకున్నాను. రాష్ట్రంలో నేడు చూసిన దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడ లేదు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అనేవి అత్యంత గౌరవప్రదమైన ఉద్యోగాలు. ఒక రాష్ట్రంతో సంబంధం లేకుండా వివిధ రాష్ట్రాల నుండి నియామకం అవుతారు.



ఇక్కడున్న కొందరు అధికారులు గతంలో ఆదర్శవంతంగా పని చేశారు. కానీ గత ఐదేళ్లలో మాత్రం ఏం చేశారో మీరే ఆత్మవిమర్శ చేసు కోవాలి. పరిపాలన ఇంత అన్యాయంగా తయారవుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు. డిపార్ట్ మెంట్ లన్నీ నిస్తేజం అయ్యాయి. సిస్టమ్స్ అన్నీ నిర్వీర్యం అయ్యాయి. గత ప్రభుత్వంపై ఎప్పుడూ చూడనంత ఫ్రస్టేషన్, కసి ప్రజల్లో వచ్చిందంటే కారణం ఐదేళ్లలో జరిగిన దారుణాలే. ప్రజా స్వామ్యంలో ప్రజల అభీష్టం మేరకే ఎవరైనా పని చేయాల్సి ఉంటుంది.

నాకు జరిగిన అన్యాయం గురించి నేను మాట్లాడటం లేదు....ఎప్పుడూ మాట్లాడను కూడా. కానీ రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించే నా బాధ. పరిపాలన గాడిలోపెట్టే విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటాను. త్వరలో మళ్లీ అందరితో మాట్లాడతా... పాలనను చక్కదిద్దుతా" అని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.

## సంస్థాగత నిర్మాణంపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి..)

బిజెపి శాశాన సభ్యులతో ఒక సమావేశం నిర్వహించారు. అదేవిధంగా ఎన్నికల్లో పోటి చేసిన పార్లమెంటు నియోజక వర్గాలుగా ఒక సమీక్ష అసెంబ్లీ నియోజకవర్గాలు పరంగా ఒక సమావేశం నిర్వహించారు. చివరిగా రాష్ట్ర ఎలక్షన్ మేనే జ్మెంట్‌తో ఒక సమావేశం నిర్వహించారు.

శాశన సభ్యుల సమావేశంలో ప్రజా ప్రయోజనాలు కు ప్రాధాన్యత ఇస్తు వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంలో సమన్వయంతో ముందుకు వెళదామని సమీక్షలో అభిప్రాయ పడ్డారు. జగన్ ఏ తప్పిదాలు చేసి ప్రజలతో చీత్కారానికి గురయ్యారో ఆతప్పిదాలు జరక్కుండా జాగ్రత్తలు పడాలని సమీక్ష సమావేశంలో అభిప్రాయం వ్యక్తం చేశారు.

జూలై మాసం నుండి సంస్థాగత నిర్మాణం పై ద్రుష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు. ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో బలపడిన నేపథ్యంలో అదే స్థాయిలో సంస్థాగతంగా బలపడాలని సమీక్షలో ప్రస్థావించారు

పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలులో మంచి గెలుపును సాధించామని అదేవిధంగా ఓటమి చెందిన స్థానాలు పై కూడా సుదీర్ఘంగానే సమీక్ష నిర్వహించారు.

ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీలో జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్ జీ మాట్లాడుతూ ఎన్నికల మేనే జ్మెంట్ కమిటీల ద్వారా అనేక రాష్ట్రాల్లో విజయాలు సాధించా మన్నారు. ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ లో ప్రతి విభాగం చేసిన సర్వీస్‌ను డాక్యుమెంట్ రూపంలోను రాష్ట్రశాఖకు అదేవిధంగా జాతీయ పార్టీకి పంపించాలన్నారు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లా డుతూ శాస్త్రీయ కోణంలో సార్వత్రిక ఎన్నికల్లో పనిచేశామ న్నారు.

ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ చేసిన సర్వీస్ ను శివప్రకాష్ జీ,రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి,శేఖర్ జీ ప్రశంసించారు. బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్రమంత్రి వై. సత్యకుమార్ పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

3

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 14, జూన్ 2024


# శవ రాజకీయాలకు పేటెంట్ వైసీపీదే

- చిత్తుచిత్తుగా ఓడించినా వైసీపీ తీరు మారలేదు
- టీడీపీ దాడులు చేస్తోందంటూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారం మానుకోవాలి
- టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ




**మంగళగిరి,మహానాడు:**
రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవంటూ వైసీపీ నేతలు రాష్ట్రపతిని కలవటం సిగ్గుచేటని, వైసీపీ అంటేనే ఏడుపు గొట్టు, శవ రాజకీయాల పార్టీ టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు.

గురువారం నాడు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.....5 ఏళ్ల పాటు వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, మారణకాండకు తగిన మూల్యం చెల్లించుకున్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చిత్తు చిత్తుగా ఎందుకు ఓడించారో ఆత్మ పరిశీలన చేసుకోకుండా మరుసటి రోజు నుంచే సిగ్గు లేకుండా శవ రాజకీయాలు మొదలు పెట్టారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవంటూ వైసీపీ నేతలు రాష్ట్రపతిని కలవటం సిగ్గుచేటు. వైసీపీ అంటేనే ఏడుపుగొట్టు, శవ రాజకీయాల పార్టీ. సీఎం పదవి కోసం తండ్రి శవం పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించింది జగన్ మోహన్ రెడ్డి. ఎవరూ చనిపోకపోయినా ఓదార్పు యాత్ర పేరుతో శవరాజకీయాలు చేసింది జగన్ రెడ్డి. 2019 లో బాబాయి శవాన్ని అడ్డుపెట్టుకుని శవ రాజకీయం చేసింది జగన్ రెడ్డి.మీ ప్రభుత్వంలో పల్నాడులో తోట చంద్రయ్యను గొంతు కోసి చంపారు. కంచర్ల జల్లయ్య యాదవ్ ని హత్య చేశారు, వీటిని దాడులు, హత్యలు అంటారు. దాచేపల్లిలో కాపు సామాజికవర్గానికి చెందిన పురంశెట్టి అంకుల్ ని కిరాతకంగా హత్య చేశారు, హత్య అని దీన్ని అంటారు.అలాగే రేపల్లెలో బీసీ బాలుడు అమర్నాద్ గౌడ్ ను పెట్రోసి పోసి తగుల పెట్టి చంపారు. జడ్ ప్లస్ కేటగిరి ఉన్న చంద్రబాబు నాయుడు ఇంటిపై జోగి రమేష్ దాడి చేశాడు.మా పార్టీ కార్యాలయంపై దాడి చేసి సిబ్బందిని విచక్షణ రహితంగా కొట్టి గాయపరిచారు.వైసీపీ ఎమ్మెల్సీ దళిత డ్రైవర్ ని చంపి డోర్ డెలివరి చేసిన చర్యలు లేవు.

మాస్క్ అడిగిన పాపానికి దళిత డా. సుధాకర్‌ను వేధించి చంపారు. ఇసుక మాఫియాని ప్రశ్నించిన చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను హత్య చేశారు. దాడులు, హత్యలు అంటే ఇవి.ఎన్నికల రోజు కూడా తాడిపత్రి, చంద్రగిరి, మాచర్లలో దాడులు చేసింది వైసీపీ. టీడీపీ దాడులు చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తే ఖబడ్దార్.... వైసీపీ నేతలు శవ రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని అనురాధ హెచ్చరించారు.





# వినయ, విధేయ లోకేష్..

ఎన్నో అవమానాలు , మరెన్నో అవహేళనలు , ముళ్ల మీద నడక , రాళ్లు పడినా ఆగని యాత్ర , భూమికి ఉన్నంత ఓర్పు , సముద్రానికి ఉన్నంత గంభీరత. తన 15 సం.ల రాజకీయ ప్రస్థానంలో ఇవన్నీ అధికమించి జనం మెచ్చిన రాజకీయ నాయకుడయ్యాడు.

అయినా అదే వినయం, అదే విధేయత, అదే ఆప్యాయత , అదే కృతజ్ఞత. ఇదే కదా చంద్రబాబు ఆధ్వర్యంలో, కార్యకర్త కైనా, లోకేష్ కైనా నేర్పించిన తెలుగుదేశం సంస్కృతి. అందుకే ఆ పార్టీ జండా నీడలో ఎందరో కార్యకర్తలు సేదతీరుతున్నారు. అదే శిక్షణలో , యువగళం పాద యాత్ర ద్వారా ప్రజల ముందుకు వచ్చిన లోకేష్ లో పరిణితి చెందిన రాజకీయ నాయకుడు బయటకు వచ్చిన ఒక ఆసక్తికర ఉదంతం నిన్న ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ప్రమాణస్వీకారం రోజున జరిగింది. లోకేష్ ప్రమాణ స్వీకార అనంతరం సభలో పెద్దలకు అభివాదం చేసిన పిదప పవన్ కళ్యాణ్ వద్దకు వచ్చి పాదాభివందనం చేయబోతే వారించాడు పవన్. అయినా పట్టువదలక లోకేష్ పాదాభివందనం చేసి పవన్ ఆశీర్వాదం పొందాడు. ఇది ఒక్కసారిగా జనసైనికులను , టి.డి.పి కార్యకర్తలకు ఒకింత ఆశ్చర్యాన్ని , ఆనందాన్ని కలిగించింది. సాధారణంగా రాజకీయాలలో తనమీద ఆరోపణలు చేసిన వ్యక్తిమీద సహజంగా కోపం ఉంటుంది. 2014 - 19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు లోకేశ్ మంత్రిగా ఉన్నాడు. అప్పుడు ఒకానొక రోజు ఊహించని విధంగా పవన్ కళ్యాణ్ లోకేష్ పై అవినీతి ఆరోపణ చేశాడు. అప్పటి వరకూ అలా పవన్ ఆరోపణ చేస్తాడని ఎవరూ ఊహించలేదు. అదే అదే నిదానంగా టి.డి.పి - జనసేన మధ్య అగాధం ఏర్పడి జనసేన టి.డి.పి తో విభేదించి పొత్తు నుండి వైదొలగి , బి.జె.పి కి దగ్గరయ్యింది. 2019 ఎన్నికల్లో జనసేన , బి.జె.పి తో పెట్టుకుని వేరుగా పోటీ చేసింది. టి.డి.పి ఓటమి చెంది ప్రతిపక్ష పాత్ర పోషించింది. కాలానుగుణంగా మారిన రాజకీయ పరిస్థితుల వల్ల , నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా , టి.డి.పి తో పొత్తుకు జనసేనాని సుముఖం తెలపడం, అందుకు తగ్గ కార్యాచరణ రూపొందించడం, పొత్తులోకి బి.జె.పి ని కూడా చేర్చే విధంగా జనసేనాని తన వంతు పాత్ర తాను పోషించాడు. ఇప్పటి 2024 ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో ఎటువంటి భేషజాలకు పోకుండా , కూటమిగా నిలచి , ఎ.పి చరిత్రలోనే అద్భుత విజయం సాధించారు. ఇక్కడ బి.జె.పి కొంత అటూ , ఇటూగా వ్యవహరించినా జనసేనాని మాత్రం బాబు వ్యూహాలకు బద్ధుడై , అభ్యర్థుల ఎంపిక , స్థానాల ఎంపికల్లో కూడా బాబు మాటకు విలువ ఇస్తూ క్రమ శిక్షణ గల సైనికుడిగా వ్యవహ రించాడు. దానితో 21 ం 2 మొత్తం నూటికి నూరు శాతం జనసేన పార్టీకి ఫలితాలు దక్కాయి. అదే విధంగా రాష్ట్రం అంతా జనసేన , టి.డి.పి ఓట్ల షేరింగ్ లో ఎక్కడా పొరపొచ్చాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ జరిగింది. అదే నిన్న సభలో కూడా ప్రస్ఫుటంగా కనిపించింది.

చిరంజీవి - పవన్ కుటుంబాలు, చంద్రబాబు - ఎన్.టి.ఆర్ కుటుంబాలు కలసిమెలసి ఒక వేడుకలా సభను ఆస్వాదించారు. లోకేష్ పెద్దల పట్ల గౌరవంతో వ్యవహరించిన తీరు , పవన్ ఎడల గతకాలపు ఛాయలను మనసులో పెట్టుకో కుండా ఆయన ఆశీర్వాదం తీసుకున్న తీరు సభికులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. ఇదే విధంగా కూటమి ఐకమత్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించాలని సర్వత్రా చర్చించు కోవడం కనిపించింది.

**- వి. ఎల్. ప్రసాద్.**

## అఖండ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా




- గళ్లా మాధవి

**గుంటూరు పశ్చిమ,మహానాడు:**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ చరిత్రలోనే ఎప్పుడు లేని విధంగా 51,000 పై మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం 44వ డివిజన్ సాకేతపురంలో ఎన్ డి ఏ కూటమి నేతల ఆధ్వర్యంలో గళ్ళా మాధవి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్.డి.యే. కూటమి నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. గల్లా మాధవినీ దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం లో అనేక సమస్యలు ఉన్నాయని డ్రైనేజీ వ్యవస్థలు కూడా సక్రమంగా లేనీ పరిస్థితి ఉందని దీనిని త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి నేతలు ప్రజలు తనకు అండగా నిలబడ్డారని వారి కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని నియోజకవర్గ ప్రజల సమస్యలను తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కార దిశగా కృషి చేస్తానని నియోజకవర్గ ప్రజల కోసం తన కార్యాలయ తలుపులు ఎప్పుడు తెరిచి ఉంటాయని గల్లా మాధవి హామీ ఇచ్చారు.

# ఆ అధికారులతో జాగ్రత్త..!

- త్వరలో శాఖలవారీ శ్వేతపత్రాలు విడుదల
- ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలించాకే సంతకం
- మంత్రులదే కీలక బాధ్యత
- రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- మంత్రులకు చంద్రబాబు హెచ్చరిక



**అమరావతి:** 'శాఖల్లో దస్త్రాలు ఎలా నిర్వహించాలి? ఏం చేయాలి ఏం చేయకూడదు?' అనే అంశాలపై మంత్రులకు శిక్షణ ఇప్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులతో అన్నారు. శాఖలవారీ శ్వేతపత్రాలు రూపొందించి ప్రజల ముందుంచు దామని ఆయన అన్నారు.

'శాఖల్లో దస్త్రాలు ఎలా నిర్వహించాలి? ఏం చేయాలి? ఏం చేయకూడదు?' అనే అంశాలపై మంత్రులకు శిక్షణ ఇప్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అమాత్యులతో అన్నారు. శాఖలవారీ శ్వేతపత్రాలు రూపొందించి ప్రజల ముందుంచుదామని ఆయన అన్నారు. మరోవైపు ఏ మంత్రికి ఏ శాఖ అనే దానిపై కసరత్తు పూర్తి చేసి నేడు వారికి బాధ్యతలు కేటాయించనున్నారు.

రోజువారీ కార్యకలాపాల్లో మంత్రులకు సహకరించేందుకు ఎంబీఏ అర్హత కలిగిన వారిని నియమిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అమాత్యులతో అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఉండవల్లి నివాసంలో తనను కలిసిన మంత్రులతో ఆయన గంటకుపైగా మాట్లాడారు. శాఖల వారీ శ్వేతపత్రాలు సిద్ధం చేసి ప్రజల ముందు ఉంచుదామని, జగన్ హయాంలో రివర్స్ విధానాలు, అరాచకాల్ని వారికి వివరిద్దామని చెప్పారు.

గత ప్రభుత్వంలోని మంత్రుల వద్ద పని చేసిన పీఏలను నియమించుకోవద్దని సూచించారు. ముఖ్యంగా ఓఎస్డీలు, పీఏ, పీఎస్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. జగన్ ప్రభుత్వంలో మంత్రుల వద్ద పని చేసిన సిబ్బందిని దరి చేరనివ్వద్దని స్పష్టం చేశారు. తమ పని తీరు ద్వారా మంత్రిత్వ శాఖలకు వన్నె తేవాల్సిన బాధ్యత మంత్రులదేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి ఇదో అపూర్వ అవకాశమని, మరింత కష్టపడి పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలించాకే సంతకం పెట్టాలని సూచించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా తాను ఎదుర్కొన్న సవాళ్లు, అప్పటి రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితుల్ని ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. జగన్ నాశనం చేసిన వ్యవస్థల్ని ప్రక్షాళన చేస్తూ రాష్ట్ర పునర్నిర్మాణంలో మంత్రులది కీలక బాధ్యత కావాలని దిశానిర్దేశం చేశారు.

పరిపాలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కేటాయించిన శాఖకు పూర్తి స్థాయి న్యాయం చేయాల్సిన బాధ్యత వారిదే అని తేల్చి చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ శాఖాపరంగా ప్రజలకు చేకూర్చాల్సిన లబ్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

మంత్రుల్లో చాలా మంది ఉన్నత విద్యావంతులు, యువకులు ఉన్నారని, ఉత్సాహంగా పనిచేయాలని చంద్రబాబు సూచించారు. ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తప్పులు జరగనివ్వద్దని స్పష్టం చేశారు. వ్యవస్థలను చక్కదిద్ది రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు.

# తొలి 'జన సంతకం'!

(మొదటిపేజీ తరువాయి..)

చంద్రబాబు నాయుడు ...నిరుద్యోగుల సమక్షంలోనే 16,347 టీచర్ పోస్టుల భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రజల భూములకు రక్షణ లేకుండా చేసే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పై రద్దు చేస్తానన్న రెండో హామీపై రైతుల సమక్షంలోనే సంతకాలు చేశారు. సామాజిక పెన్షన్లు రూ.4 వేలకు పెంపు దస్త్రంపైనా లబ్ధిదారులు సమక్షంలో మూడో సంతకం చేశారు. అన్నక్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, నైపుణ్య గణన దస్త్రంపై విద్యార్థుల సమక్షంలో ఐదో సంతకాన్ని చేశారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.....

"గత ప్రభుత్వంలో ఉద్యోగాలు లేవని ఎన్నికల ప్రచార సమయంలో యువత పెద్ద తమ ఆవేదన నా దృష్టికి తీసుకు వచ్చారు. డిఎస్సీ ద్వారా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు..ఇతర ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. పరిశ్రమలు రాకపోవడంతో ప్రైవేట్ ఉద్యోగాలు కూడా లేవు. దేశంలోనే ఎక్కువగా మన రాష్ట్రంలో 24 శాతం నిరుద్యోగం రేటు ఉంది. దీంతో నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని ఉద్యోగాలు కల్పించాలని



నేను, పవన్ కళ్యాణ్, బీజేపీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించాం. తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీ మేరకే 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై తొలి సంతకం చేశాను అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

## ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు పై రెండో సంతకం

"గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చింది. దీనిలో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రజల భూములకు రక్షణ లేకుండా చేసే ఈ చట్టంతో ప్రజలకు ఇబ్బందులు వస్తాయి. భూమిని కొందరు కొన్నారు...కొందరికి వారసత్వంగా వచ్చింది. కానీ ఆ పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకున్నారు... ఇది ఎంత వరకు న్యాయం? దానం చేసినట్లు జగనన్న భూహక్కు అని రాసుకున్నారు. చట్టాన్ని తెచ్చి ఆయన మనుషులను పెట్టుకుంటామన్నారు. సొంత మనుషులతో రికార్డుల మార్చడానికి ప్రయత్నించారు. రికార్డులు మార్చి సెటిల్ మెంట్లు కూడా చేసుకున్నారు. ఒకసారి రికార్డులు మార్చితే హైకోర్టుకు వెళ్లాలి...హైకోర్టుకు వెళితే ఏళ్లు పడుతుంది. అందుకే దీన్ని రద్దు చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## పెన్షన్ల పెంపుపై 3వ సంతకం

"మొదటి సారి రూ.35లతో పెన్షన్లు ప్రారంభించింది ఎన్టీఆర్. సమైక్యరాష్ట్రంలో నేను దాన్ని రూ.75లకు పెంచాను. విభజన తర్వాత రూ.200 ఉన్న పెన్షన్లను రూ.1000లకు, తర్వాత రూ.2వేలకు పెంచాను. కానీ తర్వాత వచ్చిన ప్రభుత్వం విడతల వారీగా పెంచింది వెయ్యి రూపాయలు మాత్రమే. ఎన్నికల




ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ రూ.4 వేలకు పెంచాం. పెంచిన పెన్షన్ పెన్షన్ తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు రూ. 1000 చొప్పున కలిపి ఇస్తానని చెప్పాను.

పెంచిన వాటితో కలిపి జులైలో రూ.7 వేలు పెన్షన్ లబ్ధిదారులకు అందుతుంది. దివ్యాంగుల పెన్షన్ కూడా రూ.6 వేలకు పెంచాం... పెంచిన పెన్షన్ మూడు నెలలకు వర్తిస్తున్నందున జూలైలో దివ్యాంగులు రూ.12 వేలు తీసుకుంటారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పెన్షన్ పెంచాము. ఇబ్బందులు పడేవారిని గుర్తించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

## నైపుణ్య గణనపై 4వ సంతకం

"యువత నైపుణ్యం లెక్కించేందుకు, దానికి అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకుక నైపుణ్య గణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రతి ఒక్కరికీ కోరికలు ఉంటాయి..కానీ వాటిని సాధించుకోవాలంటే కావాల్సిన నాలెడ్జ్, నైపుణ్యం కావాలి. ఉన్నత చదువులు చదివినా...సరైన స్కిల్స్ లేకపోవడంతో ఉద్యోగాలు రావడం లేదు. నాలెడ్జ్ ఎకానమీలో ముందుకు వెళ్తున్న సమయంలో తగిన స్కిల్స్ ఉంటే ప్రపంచంలో రాణించవచ్చు. ప్రపంచంలో ఇప్పటి వరకు జనాభా లెక్కలు చేశారు.

కులాల వారీగా లెక్కలు తీశారు..కానీ మొదటి సారిగా స్కిల్ గణనకు శ్రీకారం చుట్టాం. ఎవరికి ఎలాంటి నైపుణ్యం ఉంది... దేశంలో ఏ ఉద్యోగాలు ఉన్నాయి...దానికి తగ్గ స్కిల్స్ ఉన్నాయా లేదా అన్నది లెక్కిస్తున్నాం. పెట్టుబడులు వచ్చినప్పుడు వేరే రాష్ట్రాల నుండి ఉద్యోగులు రాకుండా మనరాష్ట్రం నుండే కావాల్సిన మానవ వనరులు అభివృద్ధి చేయాలి. కావాల్సిన నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశం." అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణపై 5వ సంతకం

"పేదవాళ్లకు అన్నం పెట్టాలన్న ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్నక్యాంటీన్ తీసుకొచ్చాం. రూ.5లకే అల్పాహారం, రూ.5 మధ్యాహ్న భోజనం, రూ5.లకే రాత్రి భోజనం అందించాం. చిరు ఉద్యోగులకు, కూలీ పనులకు వెళ్లేవాళ్లకు ఎంతో ఉపయోగపడింది. కర్నాటకలో ఇందిరా గాంధీ, తమిళ నాడులో అమ్మ క్యాంటీన్ పేరుతో క్యాంటీన్‌లు పెట్టారు...మనం ఇక్కడ అన్న క్యాంటీన్ పెట్టాం. కానీ గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసేసింది.

చాలా మంది అన్నా క్యాంటీన్ లలో భోజనాలకు విరాళాలు కూడా ఇచ్చారు. కానీ ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని రద్దు చేసి పైశాచిక ఆనందం పొందారు. అందుకే ఐదవ సంతకం అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై చేశాను. ఎన్ని క్యాంటీన్లు పెట్టాలి అనేది పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

5 సంతకాల ద్వారా లబ్ది పొందే వర్గాల సమక్షంలో ముఖ్యమంత్రి ఆయా ఫైళ్లపై సంతకాలు పెట్టారు. ఇక ప్రజల పాలన ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

4

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 14, జూన్ 2024





## భువనేశ్వరికి తెలంగాణ
# పార్టీ పగ్గాలివ్వండి

- **కరణం అంబికాకృష్ణ, కాట్రగడ్డ ప్రసూన**

తెలంగాణ: సనత్‌నగర్ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి కరణం అంబికాకృష్ణ చౌదరి, పార్టీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన ఆధ్వర్యం లో చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు.

తెలంగాణలో కూడా మళ్లీ తిరుగు బావుటా ఎగురవేయాలని ఆకాంక్షించారు. నిజం గెలవాలి అంటూ చంద్రబాబు వెన్నంటి ఉండి తెలుగుదేశాన్ని గెలి పించిన నారా భువనేశ్వరి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని అంబికాకృష్ణ చౌదరి, ప్రసూన ఆకాంక్షించారు.

### ఓయూలో టీడీపీ నేతల సంబరాలు

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఏపీ సీఎం అయిన సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ లో తెలంగాణ టీడీపీ నేతలు సంబరాలు నిర్వహించారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై చంద్రబాబుకు జై కొట్టారు. ఈ సందర్భంగా



కార్యకర్తలంతా విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, నన్నూరి నర్శిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణలోనూ
# టీడీపీ జెండా ఎగరేస్తాం..

- **తెలుగుమహిళ తెలంగాణ అధ్యక్షురాలు షకీలారెడ్డి**
- **బాబును అభినందించిన తెలంగాణ తెలుగు మహిళ**
- **మాజీలంతా తిరిగి పార్టీలోకి రావాలని పిలుపు**

విజయవాడ: సైకో పాలనకు తెరదించిన ఏపీ ప్రజల తిరుగుబాటు నియంతలకు ఒక హెచ్చరిక సందేశమని, తెలంగాణ తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును షకీలారెడ్డి కలసి, అభినందనలు తెలిపారు.


అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు సైకో జగన్‌పై చేసిన తిరుగుబాటును దేశమంతా గమనించిందన్నారు. ప్రజలను ఖాతరు చేయకుండా, ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలనే నియంతలకు ఇలాంటి గుణపాఠమే ఎదురవుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబును 56 రోజులు జైల్లో ఉంచినప్పుడు తెలుగు రాష్ట్ర ప్రజల మనసు గాయపడిందని, కోట్లాదిమంది తెలుగువారి ఉసురే జగన్‌కు శాపాలుగా పరిణమించాయన్నారు. ఆరోజే జగన్ పతనం ప్రారంభమైందన్నారు. చంద్రబాబు సారథ్యంలో ఇక ఏపీలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు.

ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కూడా టీడీపీ పురోగతి సాధిస్తుందన్నారు. తెలంగాణ ఇన్చార్జి కంభంపాటి రామ్మోహన్‌రావు, మాజీ అధ్యక్షుడు బక్కని నర్శింహులు, పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవిందకుమార్ గౌడ్, నందమూరి సుహాసిని, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సాయిబాబా నేతృత్వంలో తెలంగాణలో టీడీపీకి మంచిరోజులు రానున్నాయని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారంతా తిరిగి మాతృసంస్థకు తిరిగిరావాలని షకీలారెడ్డి పిలుపునిచ్చారు.

## ఉప్పల్‌లో
## ఫాస్ట్ బౌలర్ల కోసం
# టాలెంట్ హంట్

హైదారాబాద్,మహానాడు: ఫాస్ట్ బౌలర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోషియేషన్ ప్రత్యేకంగా టాలెంట్ హంట్ నిర్వహిస్తోందని కార్యదర్శి దేవరాజ్ తెలిపారు. ఈ నెల 22న ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టాలెంట్ హంట్ నిర్వహించనున్నామని చెప్పారు.

ఆసక్తి గల క్రికెటర్లు వచ్చే శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తమ పేర్లను హెచ్.సీ.ఏ అధికారిక వెబ్ సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు.




## బాబు పాపాలు పండుతాయి
# మనల్ని ఎవరూ ఏం చేయలేరు

- **రావణకాష్టం సృష్టిస్తున్నారు**
- **ప్రతిపక్ష హోదా ఇస్తారా? లేదా? అన్నది సందేహమే**
- **హోదాను అడగకపోవడం బాబు చేసిన మరో పాపం**
- **వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలతో క్యాంపు కార్యాలయంలో సమావేశమైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్**

విజయవాడ,మహానాడు: ఈ ఐదేళ్లు కష్టాలకు సిద్ధంగా ఉండాలని వైసీపీ అధినేత జగన్ తన పార్టీ ఎమ్మెల్సీలకు పిలుపు నిచ్చారు. "మనకు సభలో ప్రతిపక్షహోదా కూడా దక్కకపోవచ్చని, మనమీద కేసులు పెట్టడం మినహా చంద్రబాబు సర్కారు ఇంకేమీ చేయలేదు. దానిని మనం తట్టుకోవాలి. చంద్రబాబు నాయుడు పాపాలు చాలా త్వరగా పండుతాయి. అప్పటివరకూ మనం ధైర్యంగా నిలబడాలి. మనకు కష్టాలు-కేసులు కొత్తకాదు. మళ్లీ మనదే విజయం" అన్నారు.

ఈ సందర్భంగా వైయస్.జగన్ ఏమన్నారంటే జరిగిన పరిస్థితులన్నీ మీకు తెలుసు. ఈ ఫలితాలు చూసి మీరు నిబ్బరాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు. గడచిన ఐదేళ్ల కాలంలో గత చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఏకంగా 99శాతం వాగ్దానాలు అమలు చేశాం. ఏపీ చరిత్రలో కాని, దేశంలోకాని ఎప్పుడూ ఇలా జరగలేదు. మేనిఫెస్టోను బైబిల్లా, ఖురాన్లా, భగవద్గీతలా ఒక పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశాం.

మేనిఫెస్టోను చూపించి ప్రతి అక్కచెల్లెమ్మల ఆశీస్సులు తీసుకుంటూ ఇది అమలు జరిగిందా? లేదా? అని అడిగి మరీ టిక్ పెట్టించాం. ఏ రోజూ ఈ మాదిరిగా చేసిన పరిస్థితులు లేవు. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు.

రూ.2.7 లక్షల కోట్లు ఎలాంటి లంచాలు, వివక్షా లేకుండా అందించాం.

ఏ నెలలో ఏమిస్తామో ప్రతి సంవత్సరం కాలెండర్ విడుదలచేసి, ఆమేరకు మాట తప్పకుండా పథకాలు అమలు చేశాం. ఇవన్నీ కూడా ఎప్పుడూ కూడా చూడని మార్పులు.

గతంలో ఎప్పుడూ చూడని సంస్కరణలు అమలు చేశాం. విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక న్యాయం, మహిళాసాధికారిత, సుపరిపాలన విషయంలో ఎప్పుడూ జంగని, చూడని సంస్కరణలు తీసుకు వచ్చాం.

ఇవన్నీ మనం చేసి, చూపించి ప్రజల మన్ననలను పొందిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాం. కాని, ఎన్నికల్లో ఏమైందో తెలియదు.



2019 నుంచి 2024 వరకు ఐదేళ్లు ఇట్టే గడిచిపోయాయి. అదే మాదిరిగా మళ్లీ 2024 నుంచి 2029 వరకు కూడా ఇదేళ్లు ఇట్టే గడుస్తాయి.

మనం గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే.. సినిమాలో ప్రస్తుతం ఫస్టాఫ్ మాత్రమే అయ్యింది. గతంలో ఇదే మాదిరిగా పరిస్థితులు ఉన్నప్పుడు కూడా మనం ఏమాదిరిగా పైకి లేచామో అన్నది మీ అందరికీ తెలిసిందే.

ప్రజల్లో మనం చేసిన మంచి ఇవాళ ఉంది. ఇంటింటికీ మనంచేసిన మంచి బ్రతికే ఉంది. మనంచేసిన పాలనమీద విశ్వసనీయత ప్రజల్లో ఇప్పటికీ ఉంది. మనపట్ల విశ్వసనీయత ఇంకా బతికే ఉంది. గడపగడపకూ మనంచేసిన మంచి ఇంకా బతికే ఉంది. ఇవన్నీ ఉన్నప్పుడు మళ్లీ మనం పైకి లేవడం అన్నది కూడా తథ్యం. కాకపోతే కొంత సమయం పడుతుంది. ఆ సమయం మనం ఇవ్వాలి. ఆ టైం ఇచ్చినప్పుడు, వాళ్ల పాపాలు పండినప్పుడు కచ్చితంగా మనం పైకి లేస్తాం. ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి.

రాజకీయాల్లో అన్నికంటే ముఖ్యమైన అంశం క్యారెక్టర్. విలువలు, విశ్వసనీయత. ఈ పదాలకు అర్థం తెలుసుకోవడం చాలా అవసరం.

రాజకీయాలంటే అధికారం మాత్రమే కాదు. అధికారంలో లేనప్పుడు కూడా ఒక మనిషి ఎలా ప్రవర్తిస్తాడు, ఎలా ఉంటాడు అన్నదికూడా రాజకీయమే.

అధికారంలో లేనప్పుడు కచ్చితంగా కష్టాలు వస్తాయి.

కానీ, ఆ కష్టాలు వచ్చినప్పుడు ఎలా స్పందిస్తామన్నది మన చేతుల్లో ఉంది. కష్టాలు వచ్చినప్పుడు విలువలు, విశ్వసనీయత లేని మనిషిగా రాజకీయాలు చేద్దామా? లేక ఆ కష్టాలను ఎదుర్కొంటూ, హుందాగా నిలబడుతూ.. ముందడుగులు వేసి కష్టపడితే.. మళ్లీ అధికారంలోకి వస్తామా? అన్నది ఆలోచన చేయాలి.

అసెంబ్లీలో మన సంఖ్యా బలం పెద్దగాలేదు. ఆ సభలో మనకు గొంతు విప్పే అవకాశం మనకు రాకపోవచ్చు. గొంతు విప్పనివ్వకపోవచ్చు.

కాని మండలిలో మనకు బలం ఉంది. దీన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి.

మనల్ని ఎవరూ ఏం చేయలేరు. మహా అయితే నాలుగు కేసులు పెట్టగలుగుతారు. అంతకు మించి వాళ్లు ఏంచేయ గలుగుతారు?

చంద్రబాబు నాయుడు హయాంలో చాలా త్వరగా పాపాలు పండుతాయి. మన కళ్లముందే చంద్రబాబు పాపాలు ఎలా పండుతాయో గతంలో మనం అంతా చూశాం.

మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఎవరు ఓటు వేశారు అన్నది చూడకుండా.. ప్రతి పథకాన్ని డోర్ డెలివరీ చేశాం. అర్హత మాత్రమే ప్రమాణికంగా తీసుకుని.. ప్రతి పథకం ప్రతి ఇంటికే అందించాం.

అలాంటి పాలన మనదైతే.. ఈ రోజు కేవలం వాళ్ల పార్టీకి ఓటువేయకపోవడమే పాపం అన్నట్టుగా రావణకాష్టం సృష్టిస్తున్నారు. విధ్వంసం చేస్తున్నారు. ఆస్తులకు నష్టంచేస్తున్నారు. దాడులు చేస్తున్నారు. అవమానిస్తున్నారు. అమానుషంగా దాడులకు పాల్పడుతున్నారు. ఇవన్నీకూడా శిశుపాలుడి పాపాల మాదిరిగా మొదలయ్యాయి.

ఇంకోవైపు మనం మనకు ఓటు వేయకపోయినా వివక్ష చూపకుండా పథకాలకు ప్రతి ఇంటికీ డోలివరీ చేశాం. ఇప్పుడు వారు చేసిన పాపాలు ఊరికే పోవు.

చంద్రబాబు రెండో పాపం కూడా అప్పుడే పండింది. కేంద్రంలో ఇప్పుడు నెలకొన్న రాజకీయ పరిస్థితులు ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేవు. కేంద్రంలో 240 సీట్లకు అధికారపార్టీ పరిమితం కావడం, మరోవైపు రాష్ట్రంలో టీడీపీకి మంచి సంఖ్యరావడం, ఎన్డీయేలో కీలకంగా ఉన్న పరిస్థితులు ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేకహోదాను అడగకపోవడం చంద్రబాబు చేసిన మరో పాపం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదాను అడక్కపోతే.... రాష్ట్రంలో ఏ ఒక్క యువకుడు కూడా క్షమించడు.

మనం అధికారంలో ఉండి ఉంటే క్యాలెండర్ ప్రకారం అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతిదీవెన, మత్స్యకార భరోసా వంటి పథకాలు ఇప్పటికే అమల్లో ఉండేవి. ఇవి ఇప్పుడు వస్తాయో, రావో తెలియని పరిస్థితి ఉంది. రాబోయే రోజుల్లో ఈ పాపాలు పండుతాయి.

ఈ పాపాలన్నీ పండేదాకా.. మన ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదు.

మనం గట్టిగా నిలబడి, ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లగలిగేలా ప్రజల్లో నిరంతరం ఉండాలి. ఇవన్నీ మీకు తెలిసిన విషయాలే. కేవలం గుర్తు మాత్రమే చేస్తున్నాను.

కష్టాలు రావడం సర్వ సహజం. ఎదుర్కొని నిలబడ్డం అన్నది మన చేతుల్లో అంశం. అసెంబ్లీలో మనకున్న బలం ప్రకారం ప్రతిపక్ష హోదా ఇస్తారా? లేదా? అన్నది సందేహమే.

ఓటు వేయలేదన్న ఒకే ఒక్క కారణంతో మనుషులు మీద దాడులు చేస్తున్న సమయంలో, ఆస్తులు నష్టంచేస్తున్న పరిస్థితుల్లో, అవమానిస్తున్న సమయంలో ఉన్న ఒకే ఒక్క పార్టీకి ప్రతిపక్ష హోదా ఇచ్చేట్టుగా నైతిక విలువలు పాటిస్తారా? లేదా? అన్నది సందేహమే.

హనీమూన్ పీరియడ్ ముగిసేవరకూ వారికి టైం ఇద్దాం. దాడులకు గురైన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపే కార్యక్రమం చేద్దాం. రాబోయే రోజుల్లో ఇంకా టైం గడిచే కొద్దీ ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు ముమ్మరం అవుతాయి. ప్రజల్లోనే ఉంటాం.. ప్రజలతో కలిసి పోరాడే కార్యక్రమాలు రానున్న రోజుల్లో చేపడదాం. ఏకంగా 14 నెలలు పాదయాత్ర చేశాను. ఆ వయసు ఇవ్వాల్టికీ నాకు ఉంది. ఆ సత్తువ నాకు ఈ రోజుకీ ఉంది. ఆ సమయం వచ్చేదాకా ఎమ్మెల్సీలుగా మీ పాత్ర మీరు పోషించాలి.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ॥ శుక్రవారం 14, జూన్ 2024













# టీటీడీ ప్రక్షాళన

- తిరుమల పవిత్రను కాపాడతాం
- తిరుమలలో గోవింద నామస్మరణం తప్ప మరో మాట వినిపించకూడదు
- స్వార్థ ప్రయోజనాల కోసం తిరుమలను గత పాలకులు అపవిత్రం చేశారు
- ప్రజలకు మంచి చేసే శక్తిని ఇవ్వాలని శ్రీవారిని కోరుకున్నా
- రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైంది... ప్రజలంతా భాగస్వామ్యం వహించాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- శ్రీవారి సేవలో బాబు కుటుంబం

**తిరుమల/తిరుపతి :**

రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుండే ప్రక్షాళన మొదలుపెడతామని...తిరుమలలో ఓం నమో వెంకటేశాయా, గోవింద నామస్మరణ తప్ప మరో నినాదమే వినపడకుండా చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత పాలకుల హయాంలో తిరుమల కొండపైకి గంజాయితో పాటు నాన్ వెజ్, మద్యం తీసుకొచ్చి పవిత్రమైన తిరుమలను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తిరుచానారు అమ్మవారిని కూడా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకముందు కొండపైన మీడియాతో చంద్రబాబు నాయుడు మాట్లాడారు. "మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారు. 93 శాతం స్ట్రైక్ రేట్ ఎప్పుడూ దేశ, రాష్ట్ర చరిత్రలో రాలేదు. నేను ఏ సంకల్పం తీసుకన్నా వెంకటేశ్వరస్వామిని తలచుకుని ముందుకు వెళ్తా. చిన్నతనంలో కూడా దేవుడికి మొక్కులు తీర్చుకోవడానికి నడిచివచ్చేవాళ్లం. ఆయన ఆశీస్సులతో అంచలంచలుగా నేను ఎదగి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వడం, దేశ రాజకీయాల్లో పాత్ర పోషించాను. 2003లో వెంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించడానికి వస్తుంటే క్లెమోర్ మైన్స్ పేలాయి...అప్పుడు ఆ ఏడుకొండలవారే నన్ను బతికించారు. ఆయన సేవకు వచ్చి చనిపోతే అపవాదు వస్తుందనో, నా వల్ల ఈ రాష్ట్రానికి.. తెలుగుజాతికి ఇంకా మంచి చేయాలన్న ఆశీస్సులతోనో ప్రాణభిక్ష పెట్టారు. తిరుపతిలో అన్నదాన కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ప్రవేశపెట్టారు. నా మనవడు దేవాన్ష్ ప్రతి పుట్టినరోజు నాడు అన్నదానానికి విరాళం అందిస్తున్నా. నేను ఎక్కువగా పూజలు చేయకపోయినా పవిత్రమైన మనసుతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవుడ్ని ఒకటే కోరుకుంటా." అని సీఎం చంద్రబాబు అన్నారు.

## తెలుగుజాతి అత్యున్నత స్థాయిలో ఉండాలి

ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో ఉండాలి.. అందులో తెలుగుజాతి అగ్రస్థానం ఉండాలి. సంపద సృష్టించడం ఎంత ముఖ్యమో..సృష్టించిన సంపద పేదవారికి అందడం అంతే ముఖ్యం. సంపద కొంతమందికే పరిమితం కాకుండా పేదరికం లేని సమాజంగా మారాలి. పేదరికం లేని రాష్ట్రం, జిల్లాగా మారినప్పుడే మెరుగైన జీవన ప్రమాణాలతో ప్రజలు ముందుకెళ్తారు. ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు తగ్గించాలి..ఇది ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలతో సాధ్యం అవుతుంది.

1995లో సీబీఎన్ పాలన ప్రారంభమైంది. అంతక ముందు సచివాలయానికే పరిమితమైన పరిపాలన ప్రజల మధ్యన జరిగింది. ఆరోజు చేసిన అభివృద్ధితో వచ్చిన ఫలాలు



చూసి ప్రపంచాధినేతలంతా హైదరాబాద్ రావడానికి ప్రయత్నించారు. జరిగిన మంచిని ప్రపంచమంతా గుర్తిచ్చింది...ఆ గుర్తింపునే మేము తీసుకొచ్చాం. దేశానికి అతిపెద్ద సంపద కుటుంబ వ్యవస్థ. కుటుంబ వ్యవస్థలో ఎనర్జీ రీఛార్జ్ తో పాటు, భద్రత, ఆనందం, బాధలను పంచుకునే భాగస్వాములుగా ఉంటారు. నేను జైల్లో ఉన్నప్పుడు నాకు అండగా కుటుంబం నిలబడింది. జైల్లో కలవడానికి కుటుంబ సభ్యులకు వారానికి రెండు సార్లు మాత్రమే కలవనిచ్చారు.

భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. వెంకటేశ్వరస్వామి కలియుగ దేవుడు...మా ఇంటి ఇలవేల్పు దైవం. బ్రహ్మోత్సవాల సమయంలో ఒక్కపొద్దుతో నిష్టగా పూజలు చేసిన తర్వాతే మధ్యాహ్నం భోజనం చేసేవాళ్లం...ఈ సంస్కృతి చిత్తూరు జిల్లాలో చాలా కుటుంబాల్లో ఉండేది. కలియుగం దైవం వెంకటేశ్వరస్వామిని ఒక్కసారైనా దర్శించుకోవాలని అనుకుంటారు. ఎన్నిసార్లు వచ్చినా మళ్లీ రావాలని కోరుకుంటారు. ప్రపంచంలో మనదేశం ముందుండాలి... అందులో తెలుగుజాతి అగ్రస్థానంలో ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

## పేదరికం లేని సమాజాన్ని స్థాపించేందుకు శక్తినివ్వాలని కోరుకున్నా

"పేదరికం లేని సమాజాన్ని స్థాపించేందుకు నాకు శక్తిసామర్థ్యాన్ని ఇవ్వాలని వెంకటేశ్వరస్వామిని కోరుకున్నా. సంపద లేనప్పుడు...సృష్టించడం కోసం రెండవ తరం ఆర్థిక సంస్కరణలు నేను తీసుకొచ్చాను. సంస్కరణలతో బ్రహ్మాండమైన రోడ్లు వచ్చాయి. దేశంలో మొదటి నేషనల్ హైవే నెల్లూరు-చెన్నైకు ఏర్పాటైంది. అది విజయవంతమవడంతో నాటి ప్రధాని వాజ్ పేయ్ దేశమంతా అమలు చేశారు..ఈ విధానం జిల్లాలకు కూడా విస్తరించింది. ఫోన్ అన్నం పెడుతుందా అన్నారు...కానీ ఇప్పుడు నిత్యవసర వస్తువైంది...ఆయుధమైంది. వర్చువల్ వర్క్‌కు కూడా పనికొస్తోంది." అని సీఎం చంద్రబాబు అన్నారు.

## నేను ఒక్కరి వాడిని కాదు... అందరివాడిని

"పరదాలు కట్టడం అధికారులకు అలవాటైంది. జనాలు కలవకుండా కర్ఫ్యూ పెట్టారు. ఇలాంటి సంస్కృతి చూస్తే బాధేస్తోంది. పాలనలో కక్ష సాధింపు చర్యలు ఉండకూడదు. కానీ తప్పు చేసిన వారికి శిక్ష వేయకపోతే దేవుడు కూడా సహకరించరు. మంచివారిని కాపాడుకోవాలి...చెడు వ్యక్తులను శిక్షించి సమాజాన్ని కాపాడాలి. నా జీవితంలో నా కుటుంబానికి ఏమీ ఇవ్వాల్సిన అవసరం లేదు. 35 ఏళ్ల క్రితమే చిన్న వ్యాపారం స్థాపించి పెట్టి నా కుటుంబం రాజకీయాలపై ఆధారపడకుండా చేశాను.

నా జీవితంలో కుటుంబానికి ఎక్కువ సమయం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు కుటుంబానికి సమయం ఇస్తా. ఆదరించిన ప్రజలకు రుణపడి ఉంటా. మొన్నటి ఎన్నికల్లో ప్రజలను భయపెట్టారు. నాకు ప్రజలపై అపారమైన నమ్మకం, గౌరవం ఉంది. ప్రజలు గెలవాలి...రాష్ట్రం నిలవాలి...తెలుగువారు ఎక్కడున్నా తమ బాధ్యత నిర్వర్తించాలని కోరుతున్నా. ప్రజలు గెలిచారు...రాష్ట్రాన్ని నిలబెట్టారు...ప్రజలను గౌరవించాల్సిన బాధ్యత మాపై ఉంది. నేను ఏ ఒక్కరి వ్యక్తిని కాదు...అందరి వాడిని. ఐదుకోట్ల ప్రజలకు చెందిన వ్యక్తిని." అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఐదేళ్ల విధ్వంసంతో 30 ఏళ్లు వెనక్కి

కొందరు మీడియా ప్రతినిధులు కూడా ప్రజాస్వామ్యం కోసం పోరాడి కోర్టుల చుట్టూ తిరిగారు. వాస్తవాలు చెప్పలేని దుస్థితి అనుభవించారు. నాయకులు, కార్యకర్తలు విపరీతమైన క్షోభ అనుభవించారు. శనివారం వస్తే ఎప్పుడు ఎవరి ఇంటిపైకి ప్రొక్లెయిన్ వస్తుందో...41ఏ నోటీసులిస్తారో భయపడే పరిస్థితి కల్పించారు. కానీ ఇప్పుడు చెట్లు నరకడం, పరదాలు కట్టడం, ప్రొక్లెయిన్ పంపడాలు ఉండవు. రాష్ట్రంలో ఇక ప్రజా పాలన ప్రారంభమైంది. ఉద్యోగులు కూడా ఇబ్బంది పడ్డారు.


ప్రజలు కూడా అన్యాయం జరిగిందని చెప్పుకోవడానికి ఇబ్బంది పడ్డారు. ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని నాపై నమ్మకం పెట్టుకున్నారు. ఆ నమ్మకాన్ని నేను నిరూపించుకోవాలి. ఐదేళ్లలో జరిగిన విధ్వంసంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. తిరిగి పునర్నిర్మించుకోవాలి. పాలనలో రాగద్వేషాలకు తావు లేదు. ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించి ప్రభుత్వంలో భాగం కావాలి. 2047 నాటికి దేశం ప్రపంచంలోనే నెంబర్-1 గా ఉంటుంది. ఏ దేశానికి వెళ్లినా భారతీయులు ఖచ్చితంగా ఉంటారు...అందులో తెలుగువారు ఎక్కువగా ఉంటారు.

టెక్నాలజీ, ఐటీని అందిపుచ్చుకుని అంచలంచలుగా ఎదిగి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దాకా వచ్చాం. రాబోయే రోజుల్లో కార్పొరేట్ గవర్నెన్స్, పబ్లిక్ గవర్నెన్స్ లో భారతీయులు రాణిస్తారు. సర్వీస్ ఎకానమీలో భారతీయుల సేవలు ప్రపంచానికి అవసరం ఉంటుంది. 2047 నాటికి నాటికి తెలుగుజాతి నెంబర్-1గా ఉంటుంది." అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## తెలుగు జాతికి పెద్దగా ఉంటా...

"రాష్ట్రంలో పేదరిక నిర్మూలన చేయాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ కూడా బాగుండాలి. తెలుగుజాతికి నేను పెద్దగా ఉంటా. విభజన జరిగినప్పుడు హైదరాబాద్ తెలంగాణకు వెళ్లింది...కష్టపడి ఏపీకి మంచి నగరం నిర్మించి అభివృద్ధి చేసి రుణం తీర్చుకోవాలనుకున్నా. అందుకే అమరావతి, పోలవరం ప్రారంభిస్తే అవి రెండూ గత ప్రభుత్వంలో పడకేశాయి, అమరావతి విధ్వంసం పాలైంది...ప్రతి ఎకరాకు నీళ్లిచ్చే జీవనాడి పోలవార్ని గోదావరిలో కలిపారు, ప్రజలు, ఎన్డీయే కార్యకర్తల ఆరోగ్యంతో బాగుండాలి...నేను అనుకున్న సంకల్పం ముందుకు వెళ్లేలా దేవుడు ఆశీర్వదించాలి.

తిరుమల పవిత్రమైన దివ్యక్షేత్రం...ఈ దివ్య క్షేత్రాన్ని అపవిత్రం చేయడం భావ్యం కాదు. ప్రసాదాల నాణ్యత లేకుండా, శుభ్రం లేకుండా తిలోదకాలు తెచ్చారు. ఓం నమో వెంకటేశాయా...గోవింద నామస్మరణ తప్ప మరో మరో నినాదం కొండపై ఉండకూడదు. మొత్తం ప్రక్షాళన చేసి ప్రపంచమంతా అభినందించేలా టీటీడీని తీర్చిదిద్దుతాం. దొంగలే దొంగ దొంగ అంటూ అటెన్షన్ డైవర్షన్ చేస్తున్నారు. అలాంటి వారికి నేను సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. సంఘవిద్రోహ శక్తులు, రౌడీలు లేకుండా చేశాను. రాజకీయ ముసుగులో నేరస్తులు ఉండకూడదు. నేరాలు చేసినా తప్పించుకోలేరు." అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.







6

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 14, జూన్ 2024



## ఆగస్టు 15 నాటికి లక్షా ఇరవై వేల ఎకరాలకు

# గోదావరి నీళ్లు...

- సీతారామ పేరిట రీ డిజైన్ తో ప్రజాధనం దుర్వినియోగం
- ఎనిమిది వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరానికి నీరు ఇవ్వని గత బిఆర్ఎస్ ప్రభుత్వం
- ఎన్మార్ లింకు కెనాన్ కు రాజీవ్ కెనాల్ గా నామకరణం
- మంత్రులతో కలిసి సీతారామ ప్రాజెక్టుపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఇరిగేషన్ సెక్టార్ ను నాశనం చేసిన మాజీ సీఎం కేసీఆర్: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి
- 6 గంటల పాటు సీతారామ ప్రాజెక్టు పనుల పరిశీలన
- కెనాల్ వెంట 63 కిలోమీటర్లు ప్రయాణం చేసిన డిప్యూటీ సీఎం, మంత్రులు

భద్రాద్రి కొత్తగూడెం,మహానాడు:

ఆగస్టు 15 నాటికి ఎన్మారు లింకు కెనాల్‌ను పూర్తి చేసి లక్షా ఇరవై వేల ఎకరాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం గోదావరి నీళ్లను అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారి పల్లి వద్ద ఉన్న సీతారామ హెడ్ రెగ్యులేటరీ పనులను, అక్కడ



ఉన్న వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించారు.

అక్కడి నుంచి సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌజ్- 1 వద్దకు చేరుకొని పంప్ హౌజ్ పనులను పరిశీలించిన అనంతరం పవర్ సప్లై ను ప్రారంభించారు. ఆ తర్వాత పంపు హౌజ్ -3 వద్దకు చేరుకొని ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇప్పటివరకు జరిగిన ప్రాజెక్టు పనులు, కొనసాగుతున్న కెనాల్స్ పనులు, భూ సేకరణ, ప్రాజెక్టు పూర్తి కావడానికి కావలసిన నిధులు, ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు మంత్రులకు వివరించారు.

అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేవలం రూ. 2654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసి 20 వేల కోట్ల రూపాయలకు పెంచి గత ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్విని యోగం చేసిందని విమర్శించారు. దశాబ్ద పాలనలో సీతారామ ప్రాజెక్టుపై ఎనిమిది వేల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం ఒక్క ఎకరానికి కూడా తాగునీరు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షలు చేశామన్నారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడానికి సమీక్షంచమన్నారు. సీతారామ ప్రాజెక్టు కు ఎన్ఎస్పిఎల్ కెనాల్ కు లింకు చేయడానికి 9 కిలోమీటర్లు ఉన్న ఎన్మార్ లింక్ కెనాల్ ను పూర్తి చేయడానికి 72 కోట్లు రూపాయలు మంజూరి చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముందు ఈ పనులను సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వైరాకు వచ్చి శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా పంప్స్ ట్రయల్ రన్ చేయడానికి కావలసిన పవర్ సప్లై కోసం నిధులు ఇచ్చామన్నారు.

పంప్స్ ట్రయల్ రన్ ప్రాసెసింగ్ కొనసాగుతుందని చెప్పారు. ఎన్మార్ లింకు కెనాల్ ను రాజీవ్ కెనాల్ గా నామకరణం చేస్తున్నట్టు వెల్లడించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌజ్ 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు తొందరలోనే మొదలు పెడతామని వెల్లడించారు

### ఇరిగేషన్ సెక్టార్‌ను నాశనం చేసిన కేసీఆర్: మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

ప్రణాళిక లేకుండా అనాలోచితంగా ఇరిగేషన్ సెక్టార్ను గత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రం కోలుకోలేని విధంగా ఆర్థికంగా చాలా నష్టం చేసిందని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు 90 4000 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కేవలం 93000 ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోకి తీసుకువచ్చిందని వివరించారు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 27 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక ఎకరం కూడా కొత్త ఆయకట్టు తీసుకురాలేదన్నారు.

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 9000 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఒక ఎకరం కొత్త ఆయకట్టుకు నీరు ఇవ్వలేదన్నారు. గత బిహారీ సర్కార్ మొదలుపెట్టిన ఏ సాగునీటి ప్రాజెక్టులను 10 సంవత్సరాల పాలనలో పూర్తి చేయలేని అసమర్ధత ప్రభుత్వమని విమర్శించారు. కొత్తగూడెం పినపాక భద్రాచలం నియోజకవర్గం హామీ ఇచ్చారు తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో సాగునీరు ఇవ్వడానికి ఇరిగేషన్ శాఖ ప్రణాళికను తయారు చేసుకొని ముందుకు పోతున్నదని వివరించారు.

2000 కోట్లతో పూర్తయి రాజీవ్ సాగర్ ను సరైన కారణం లేకుండా రీ డిజైన్ చేసి 20 వేల కోట్ల రూపాయలకు గత ప్రభుత్వం పెంచడం వెనుక ఆంతర్యం ఏంటో ప్రజలకు అర్థం చేసుకోవాలన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గోదావరి నది జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తుం దన్నారు. రీడిజన్ పేరిట తప్పుడు నిర్ణయం తీసుకొని రాష్ట్రానికి హార్ధిక భారం మోపినప్పటికీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజె క్టును పూర్తి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

సీతారామ ప్రాజెక్టు పూర్తి కావడానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేంద్ర పర్యావరణ శాఖలో ఉన్న స్ట్రీలను తొలగించి పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు రైతులకు మేలు జరిగే విధంగా భారీ మధ్య చిన్న తరహా సాగునీటి పెండింగ్ ప్రాజె క్టును ఖమ్మం జిల్లాలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు





# తెదేపా కేంద్ర కార్యాలయంలో అంబరాన్నంటిన సంబురాలు

- ఐదేళ్లకు ఒకసారి వచ్చే మరపు రాని దీపావళి పండుగ
- రాష్ట్రానికి పట్టిన పీడ వదలడమే కాకుండా ప్రజా పరిపాలన తిరిగి అధికారంలోకి వచ్చింది
- జగన్ రెడ్డి అరాచక, అవినీతి, విధ్వంసక, నియంత పాలన మాకొద్దని ప్రజా ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారు
- ప్రజాభీష్ట ప్రకారమే ఎన్డీఏ ప్రభుత్వం నడుస్తుంది
- సీఎంగా బాధ్యతలు చెపట్టిన వెంటనే ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాల ప్రకారం మొదట ఐదు ఫైల్స్‌పై చంద్రబాబు గారు సంతకం చేశారు
- ఇచ్చిన ప్రతీ వాగ్ధానానికి కట్టుబడి ఉంటాం.. ప్రతీ హామీని నెరవేరుస్తాం
- ప్రజా సంక్షేమం, అభివృద్ధి పదంలో రాష్ట్రాన్ని నడిపించడానికి నేడు సీఎం చంద్రబాబు గారు శంఖారావం పూరించారు
- టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, టీడీ జనార్ధన్

మంగళగిరి,మహానాడు:

ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు స్వీకరించడంతో పాటు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, రూ.4 వేలకు పెన్షన్ పెంపు, అన్నా క్యాంటీన్లు పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైల్స్‌పై నారా చంద్రబాబు నాయుడు గారు సంతకం చేసిన శుభసందర్భాన్ని



రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి.

ఈ తరుణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో కూడా సందడి వాతావరణం నెలకొంది. తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, టీడీ జనార్ధన్ కార్యకర్తలతో కలిసి బాణాసంచా కాల్చి వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వర్ల రామయ్య, టిడి జనార్ధన్ పాల్గొన్నారు.



### నేడు రాష్ట్ర ప్రజలందరికీ మరపురాని దీపావళి పండుగ: వర్ల రామయ్య

"నేడు నరకాసుర వధ జరిగింది. ప్రజాపాలన మొదలైంది. ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఏమైతే చెప్పారు ఆ ఐదు ఫైల్స్ పైనే మొదట సంతకాలు పెట్టారు. మెగా డీఎస్సీపై మొదటి సంతకం పెడతానని ఇచ్చిన మాటను నేడు నిలబెట్టుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి రద్దు చేశారు. అవ్వాతాతలకు ఇచ్చే రూ.3 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతున్నట్లు మూడవ సంతకం పెట్టారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం చేశారు. నైపుణ్య గణనపై ఐదో సంతకం చేసిన మహానుభావుడు నారా చంద్రబాబు గారు. ప్రజలు, పెద్దలు, అధికారుల సమక్షంలో ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు స్వీకరించడంతో పాటు ఎన్నికల ప్రచారాల్లో ఇచ్చిన వాగ్ధానాలపై సంతకాలు చేశారు. రాష్ట్రమంతటా బాణాసంచా పేలుస్తూ ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తబరిచారు.

నేడు రాష్ట్ర ప్రజలందరికీ మరపురాని దీపావళి పండుగ. ప్రతీ సంవత్సరం వచ్చే దీపావళి కంటే ఈ దీపావళి ఎంతో ప్రత్యేకమైనది. రాష్ట్రానికి పట్టిన పీడ వదలడమే కాకుండా ప్రజా పరిపాలన తిరిగి అధికారంలోకి వచ్చింది. ఈ దీపావళి ఐదు సంవత్సరాలకు ఒకసారి వస్తుంది. ఈ దీపావళి పండుగలు మరెన్నో జరుపుకుంటూ చంద్రబాబు నాయకత్వంలో ప్రజా పాలన కొనసాగుతూ ఉండాలని కోరుకుంటున్నాను.

రాష్ట్రవ్యాప్తంగా ఈ విజయోత్సవాల్లో పాలుపంచుకున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్దేషకులు. విర్రవీగి ప్రవర్తిస్తే ఒక్క క్షణం కూడా ప్రజలు భరించరు. దీనికి ఉదాహరణ ప్రత్యక్షంగా నేడు మన రాష్ట్రంలో



కనపడుతోంది. జగన్ రెడ్డి అరాచక, దుర్మార్గపు, ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక పరిపాలన మాకొద్దని ప్రజలే నిర్దేశించారు. అందుకే ప్రజాప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారు. అందుకు అనుగుణంగానే ప్రజాభీష్ట ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వం నడుస్తుంది" అని తెలిపారు.

### ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే చంద్రన్న ధ్యేయం: టిడి జనార్ధన్

"రాష్ట్ర ప్రజలందరూ అరచేతిలో ప్రాణం పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ చీకటి రాజ్యంలో జీవించారు. వాక్ స్వేచ్ఛ, ఫోన్ మాట్లాడే స్వతంత్ర్యం, ఏ క్షణాన ఎవరిని అరెస్ట్ చేస్తారోనన్న భయం, కనీసం నచ్చిన పోస్టును వేరొకరికి ఫార్వార్డ్ చేసుకునే స్వాతంత్ర్యం కూడా మన రాష్ట్రంలో ఉండేది కాదు. కానీ నేడు టన్ను భారం తల మీద నుండి దిగినంత సంతోషంగా రాష్ట్ర ప్రజలున్నారు. స్వేచ్ఛగా, సుఖంగా, సంతోషంగా రాష్ట్రంలో ప్రజలు పండగా చేసుకుంటున్నారు.

నియంతలను, అహంకారమున్న వారిని ప్రజలు సహించరనేదానికి మొన్నటి తీర్పే ఉదాహరణ. చరిత్రలో కూడా అహంకారంతో రాజ్యమేలిన వారు కూడా బ్రతికి బట్ట కట్టలేదు. ఒక్క ఛాన్స్ అన్నారు కాబట్టే ప్రజలు 2019లో ఆఖరి ఛాన్స్ ఇచ్చారు. రాజకీయాలకు వీరు పనికి రారు అనేటటువంటి తీర్పును నేడు ప్రజలిచ్చారు. భారతదేశ రాజకీయాల్లో ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఒక ప్రజభుత్వాన్ని ధిక్కరించి మరొక ప్రభుత్వాన్ని తీసుకువచ్చినటువంటి పరిస్థితి ఇదే మొదటిసారి. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు, వయస్సుకు అతీతంగా అందరూ ఏకమై ఇచ్చిన తీర్పు ఇది.

ప్రజల బాధను అర్థం చేసుకొని వారి మేలు కొరకు ఎన్డీఏ తరఫున ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు కొన్ని హామీలని చ్చారు. అందుకే నిన్న ప్రమాణస్వీకారం చేసి, నేడు సీఎంగా బాధ్యతలు స్వీకరించి, ఐదు ఫైల్స్‌పై సంతకం చేశారు. పరిశ్రమలు పోయాయి, ఉద్యోగాలు లేకుండా యువతను జగన్ రెడ్డి మోసం చేశారు. అందు కోసమే డీఎస్సీపై చంద్రబాబు మొట్టమొదటి సంతకం చేశారు.

ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టడంతో పాటు చివరకు సెక్రటేరియట్‌ను కూడా తాకట్టు పెట్టడం భారతదేశంలో ఎక్కడా జరగలేదు. అన్ని అయిపోయి చివరకు ప్రజల ఆస్తులపై పడి ఒక తప్పుడు చట్టాన్ని తీసుకువచ్చారు. అటువంటి భయంకరమైన చట్టాన్ని రద్దు చేస్తూ రెండో సంతకాన్ని చంద్రబాబు చేశారు. పెన్షన్ పథకాన్ని ప్రారంభించింది ఎన్టీఆర్ గారు. రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుది. కానీ జగన్ రెడ్డి మాయమాటలు చెప్పి వెయ్యి రూపాయిలు పెంచడానికి ఐదేళ్లు చేశారు.

చంద్రబాబు మాత్రం ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క కలం పోటుతో రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలుకు పెంచారు. పేదలు, కూలోలు పొట్ట నింపుకునే అన్నా క్యాంటీన్లను దుర్మార్గపు ప్రభుత్వం రద్దు చేసింది. దాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు నాలుగో సంతకం చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రం అభివృద్ధి పదంలో నడిపించడానికి చంద్ర బాబు శంఖారావం పూరించారు. ఈ శుభసందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ నేడు, రేపు, ఎల్లుండు కార్యక్రమాలు చేయబోతున్నారు" అని తెలిపారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 14, జూన్ 2024

# మోదీ కేబినెట్‌లో 99 శాతం మంది కోటీశ్వరులు

- ఏడీఆర్ నివేదిక వెల్లడి





**న్యూఢిల్లీ, మహానాడు:**

మోదీ సర్కారులోని కొత్త కేబినెట్ లో 99 శాతం మంది కోటీశ్వరులేనని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. 71 మందిలో 70 మంది కోటీశ్వరులేనని పేర్కొంది. 39 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయని తెలిపింది.

80 శాతం మంది గ్రాడ్యుయేషన్ లేదా ఆపై డిగ్రీ కలిగి ఉండగా, 15 శాతం మంది 12వ తరగతి వరకే చదువు కున్నారు. మంత్రుల ఆస్తుల సగటు రూ. 107.94 కోట్లుగా ఉంది. ఆరుగురు మంత్రుల ఆస్తులు రూ. 100 కోట్లకు పైమాటేనని నివేదిక తెలిపింది.

# ఢిల్లీలో విజయసాయి పెడబొబ్బలు

- దొంగే దొంగా .. దొంగ అన్నట్లుగా వైకాపా నేతల తీరు ఎవర్ని ఏమి అనకముందే ... మమ్మల్ని కొట్టారంటూ ఢిల్లీలో విజయసాయి పెడబొబ్బలు
- ఏమీ జరగకుండానే వాళ్ళు చేసినట్లుగానే ఈ ప్రభుత్వంలోనూ దాడులు చేస్తారనే భయంతోనే ఈ రకమైన ప్రకటనలు
- ఒకటి, అర సంఘటనలు జరిగితే అవి వ్యక్తిగత దాడులే తప్ప పార్టీల ప్రమేయం లేదు
- ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజు



**అమరావతి,మహానాడు:**

దొంగే దొంగా దొంగ అన్నట్లుగా వైకాపా నేతలు వ్యవహరిస్తున్నారని ఉండి శాసనసభ్యులు రఘు రామ కృష్ణంరాజు విమర్శించారు. ఎవర్ని ఏమి అనకముందే, మమ్మల్ని కొట్టారని ఢిల్లీలో విజయసాయిరెడ్డి , ఇతర నాయకులు చేసిన ప్రకటన చూస్తే హాస్యాస్పదంగా ఉందన్నారు. గురువారం నాడు రఘురామకృష్ణంరాజు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ఒక ఎంపీ పై తప్పుడు కేసు నమోదు చేసి, పట్టపగలే ఇంట్లో నుంచి అపహరించి తీసుకువెళ్లి, అర్ధరాత్రి చావబాదినట్లుగా ఆధారాలున్నా సరే గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. వాళ్లు ఎంత దుర్మార్గులో నాకన్నా తెలిసిన వారు మరెవరు ఉండరని అన్నారు.

కొంతమందిని అన్యాయం గా గత ప్రభుత్వ హయాంలో చంపేశారని, ఒక ఎంపీ స్థాయి వ్యక్తిని అపహరించి చితక బాదరంటే వాళ్లు ఎంతటి దుర్మార్గులో ఇట్టే తెలిసిపోతుందన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా నా ఫ్లెక్సీ కూడా కట్టకుండా అడ్డుకున్నారు. ఎవరైనా అభిమానంతో ఫ్లెక్సీ కడితే వారికి పోలీసులు ఫోన్లు చేసి బెదిరించేవారు. ఇలా ఎన్నో దుర్మార్గాలు చేసినవారు ఇప్పుడు ఏమి జరగక ముందే , ఏదో జరిగిపోతుందనే భయంతో ముందుగానే తమని కొడుతున్నారని, చంపేస్తున్నారని పెడ బొబ్బలు పెడుతున్నారని రఘురామకృష్ణం రాజు విమర్శించారు.

ఒకటి, అర సంఘటనలు జరిగితే జరిగి ఉండవచ్చు. అది పార్టీలకు సంబంధం లేదు. ఇద్దరి వ్యక్తుల మధ్య ఏవైనా మనస్పర్ధలు ఉంటే ఘర్షణ పడి ఉండవచ్చు. ఇద్దరిలో దెబ్బలు తగిలిన వ్యక్తికి వైకాపా ముసుగు తగిలించి, వైకాపా వారిని చంపేశారంటూ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు.

### అంచనాలు తప్పాయి

ఎన్నికల అనంతరం వైకాపా పార్టీ సంకనాకి పోబోతుందని నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నానని రఘురామ కృష్ణంరాజు గుర్తు చేశారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓ పాతిక సీట్లు మాత్రమే వస్తాయని ఎన్నోసార్లు చెప్పానని పేర్కొన్నారు. అయితే ఆ పార్టీకి కేవలం 11 సీట్లు మాత్రమే పరిమితమయిందని, తన అంచనా కూడా తప్పిందని రఘురామ కృష్ణంరాజు అంగీకరించారు.

ఎన్నికల అనంతరం వైకాపా నేతల మాటలు విని ఎవరైనా పందాలు కాస్తారేమోనని చెప్పి, ఓట్లు పడిపోయాయి పరిస్థితి దారుణంగా ఉందని... పందాలు కాయవద్దని హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. వైకాపా నేతల మాటలు విన్నవారు పందాలు కాసి కొంతమంది ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకున్నారని, దానికి కూడా వైకాపా అధికారంలోకి రానందువల్లే మనస్థాపంతో వారు ఆత్మహత్యలు చేసుకున్నారని వక్ర భాష్యాన్ని చెప్పే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బహుశా జగన్మోహన్ రెడ్డి ఓదార్పు యాత్ర 2.0 చేపడుతారేమోనని ఎద్దేవా చేశారు.

### ఇకపై జగన్మోహన్ రెడ్డి గురించి వ్యక్తిగతంగా నేనేమీ మాట్లాడను

జగన్మోహన్ రెడ్డి గురించి ఇకపై వ్యక్తిగతంగా నేనేమి మాట్లాడ దల్చుకోలేదని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి భాషలోనే చెప్పాలంటే... మంచో చెడో ఆయన చేయాల్సింది చేశాడు, వెళ్లిపోయాడన్నారు . ఇప్పుడు ప్రజలు గమనించేది మేము ఏమి చేస్తామని మాత్రమేనని, ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చామని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామో లేదో అన్నదానిపైనే వారు దృష్టి సారిస్తారన్నారు.

అంతేకానీ జగన్మోహన్ రెడ్డి పై, వైకాపా నాయకత్వంపై ప్రజల దృష్టి ఉండదని పేర్కొన్నారు. మేము ప్రజలకు ఇచ్చిన మాటను ప్రజలు బలంగా విశ్వసించారు. జగన్మోహన్ రెడ్డిని కాదనుకున్నారు. మేము ఊహించిన దానికన్నా ఎక్కువగా మమ్మల్ని అందలం ఎక్కించారు. ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదే విషయాన్ని చెప్పారని గుర్తు చేశారు. ప్రజలు మనకు అధికారాన్ని ఇవ్వ లేదు... బాధ్యతను అప్పగించారని, ఆ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారన్నారు.

ఇతరులపై దాడులు చేయడం కరెక్ట్ కాదని, తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని చంద్రబాబు నాయుడు, శాసన సభ్యులకు దిశా నిర్దేశం చేశారని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశాన్ని కంటే ఒక రోజు ముందే నా కస్టోడియల్ టార్చర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

నిన్న, మొన్నటి వరకు పోలీసులు ప్రమాణ స్వీకారోత్సవ హడావుడిలో ఉన్నారని, బహుశా నేను ఇచ్చిన ఫిర్యాదు పై ఒకటి, రెండురోజుల వ్యవధిలో ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చునన్నారు. ఒక ఎంపీగా చిత్రహింసలు అనుభవించిన నేను, నాపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని మిలిటరీ ఆసుపత్రి నివేదికలు స్పష్టంగా పేర్కొన్న తర్వాత నాకు నేను న్యాయం చేసుకోకపోతే, ఇక సామాన్య పౌరుడికి న్యాయం జరుగుతుందన్న నమ్మకం పోయే ప్రమాదం ఉందన్నారు.

నాకు నేనుగా ఈ నిర్ణయం తీసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశానని రఘురామకృష్ణం రాజు తెలిపారు. అయితే నా వెనుక ఎవరో ఉన్నారని, పార్టీ పెద్దలు ఉన్నారనే ప్రచారం తప్పని పేర్కొన్న ఆయన, అసలు నేను ఎవరిని కలువ లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుని పోతుందనే ఉద్దేశంతోనే నేను ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. కచ్చితంగా నాకు న్యాయం జరిగితే, ప్రజలకు కూడా తమకు జరిగిన అన్యాయాలపై చట్ట ప్రకారం న్యాయం జరుగుతుందనే నమ్మకం వస్తుందనేది నా విశ్వాసమన్నారు.

నా విశ్వాసం ఏమవుతుందనేది చూడాలన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంపై, మా ప్రభుత్వంపై ప్రజలు ఎంతో విశ్వాసాన్ని పెట్టుకున్నారని ముఖ్యమంత్రి చెప్పినట్లుగా అందరూ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రఘురామ కృష్ణంరాజు వెల్లడించారు. కచ్చితంగా బాధ్యతాయుతంగా నడుచుకోకపోతే ఇక్కడ ఏ నాయకుడు గొప్ప కాదని ప్రజలే గొప్ప అని మరోసారి ప్రూవ్ చేశారని గుర్తు చేశారు.

### 20% ఓటర్లే కీలకం... వారి మనసు నొచ్చుకోకుండా ప్రవర్తించాలి

గత ఎన్నికల్లో వైకాపాకు 151 స్థానాలను ఇచ్చిన ప్రజలు, ఈసారి ఎన్నికల్లో కూటమికి 164 స్థానాలను ఇచ్చారని రఘురామ కృష్ణంరాజు గుర్తు చేశారు. గత ఎన్నికల్లో టిడిపికి 40% ఓట్లు పోల్ కాగా, ఈసారి జగన్మోహన్ రెడ్డికి కూడా అంతే సంఖ్యలో ఓట్లు వచ్చాయని పేర్కొన్నారు. ప్రధాన పార్టీల మధ్య ఉన్న వ్యత్యాసం 20% మాత్రమేనని , ఆ 20 శాతం తటస్థ ఓటర్లే ఇంపార్టెంట్. వారే ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తారు.

మంచి జరుగుతుందనుకుంటే, ప్రజా సంక్షేమం కోసం వారు ఓటు వేస్తారన్నారు. వాళ్ల మనస్సు నొచ్చు కోకుండా, మా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. అందులో ఎవరికి ఎటువంటి అపనమ్మకం ఉండాల్సిన అవసరం లేదన్నారు. అందరూ ఒళ్ళు దగ్గర పెట్టుకొని పని చేయాలని శాసన సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గ నిర్దేశం చేశారన్న రఘురామకృష్ణంరాజు, అది టిడిపి శాసన సభ్యులైన, ఇతర పార్టీల శాసనసభ్యులైనా ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఒళ్ళు దగ్గర పెట్టుకొని పనిచేయకపోతే ఏమవుతుందో ఇటీవల ఎన్నికల ఫలితాలలో చూశామన్నారు.

### అసెంబ్లీ సమావేశాల అనంతరం గ్రామాలలో పర్యటిస్తా

వచ్చే సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయని, అసెంబ్లీ సమావేశాల అనంతరం ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో పర్యటిస్తానని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. తెదేపా అభ్యర్థిగా నన్ను ప్రకటించిన వెంటనే ప్రజలంతా నా విజయాన్ని కాంక్షించారు. అలాగే మీడియా ప్రతినిధులు నేను చెప్పిన మాటలను ప్రజలకు చేర్చారు. నా విజయంలో భాగస్వాములైన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రఘురామ కృష్ణంరాజు అన్నారు.

ప్రతి గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులను, కార్యకర్తలను కలుసుకోవడమే కాకుండా నన్ను వ్యక్తిగతంగా అభిమానించి నా విజయానికి దోహదపడిన ప్రజలందరిని కలిసి ఈ కార్యక్రమం ద్వారా ధన్యవాదాలు తెలియజేస్తానని చెప్పారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నానని రఘురామ కృష్ణంరాజు వివరించారు.

### ఊహలలో కంటే అందమైన పల్లెటూరు పాతాళ మరక

పాతాళ మరక గ్రామాన్ని శివ వర్మ అభివృద్ధి చేసిన తీరు నాకు ఎంతో స్ఫూర్తిదాయకంగా అనిపించింది. పల్లెటూర్లు ఎంత అందంగా ఉండాలని అనుకుంటామో, ఆ ఊహలలో కంటే అందంగా పాతాళ మరక గ్రామాన్ని శివవర్మ తీర్చిదిద్దారు. స్థానిక మంచినీటి చెరువు, స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తూ పరిశుభ్రంగా ఉంటుందన్నారు.

శివ వర్మ స్ఫూర్తితో ప్రతి గ్రామంలో ఐదుగురు శివవర్మలు ముందుకు వస్తే ఉండి నియోజకవర్గం మొత్తాన్ని కూడా అద్భుతంగా తీర్చిదిద్దవచ్చునన్నారు. కానీ అది అంతా ఈజీ కాదని శివ వర్మ ఆయన సొంత డబ్బులు ఖర్చు చేశారన్నారు. ప్రతి గ్రామంలో డబ్బులు ఉన్నవారు ఉన్న కానీ కాన్సెప్ట్, హృదయం ఉన్నవాళ్లు తక్కువ అని, అటువంటి వారిలో సామాజిక చైతన్యాన్ని కలిగించడం ద్వారా ప్రతి గ్రామాన్ని పాతాళ మరక గ్రామం మాదిరిగానే అభివృద్ధి చేయాలి.

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముందు పరిశుభ్రత ఎంతో అవసరం. ఇంట్లో నుంచి చెత్త తెచ్చి రోడ్ల మీద వేయడం కరెక్ట్ కాదు. పాతాళ మరక గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ను మంత్రి పవన్ కళ్యాణ్ కు కేటాయిస్తారనే వార్తలను పేపర్లో చదివాను. అసెంబ్లీ సమావేశాలు అనంతరం పవన్ కళ్యాణ్ ను పాతాళ మరక గ్రామానికి ఆహ్వానిస్తాను. పాతాళ మరక గ్రామాన్ని వచ్చి చూడాలని, రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని ఈ ఊరును స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి చేయాలని కోరుతానని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

### ఉండి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నది నా కోరిక

రాష్ట్రంలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే నా కోరిక అని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. కోరికలు ఉన్నాయి... ఓపిక ఉంది... అలాగే కచ్చితంగా చేయగలననే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మంచినీటి సమస్య, మురుగు నీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు తెలిపారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని చెప్పారు.

కేంద్రంలోని జలశక్తి మంత్రి సి ఆర్ పాటిల్ తనకు అత్యంత సన్నిహితులని ఆయన సహకారంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా ఎవరికి ఆ శాఖ కేటాయించిన వారితో సమన్వయం చేసుకొని తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి నిధుల మంజూరి కోసం కృషి చేస్తానని రఘురామ కృష్ణంరాజు వివరించారు. ఇప్పటికే ఉన్న తాగునీటి పైప్ లైన్ కు మరమ్మత్తుల ద్వారా నియోజకవర్గ పరిధిలోని 45 నుంచి 46 గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్య తాత్కాలికంగా పరిష్కారం అవుతుందని తెలిపారు.

ఇప్పటికే ఈ విషయమై ఇంజనీర్లతో మాట్లాడడంతో పాటు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే మరొకసారి జిల్లా కలెక్టర్ తో సమావేశమై, ప్రస్తుత పైప్ లైన్‌కు మరమ్మతులు చేపట్టే ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. తాత్కాలిక మరమ్మత్తుల కోసం చేసే ఖర్చు కూడా వృధా కాకుండా, అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

### ప్రభుత్వ సహకారం, పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో డ్రైనేజ్ వ్యవస్థ పూడికతీత

ప్రభుత్వ సహకారం తీసుకుని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో డ్రైనేజీ లైన్ల పూడిక తీత పనులను చేపట్టనున్నట్లు రఘురామకృష్ణం రాజు తెలిపారు. అలాగే చెరువులలో గుర్రపు డెక్క తొలగించే పనులను చేపట్టనున్నట్లు ఆయన డ్రైనేజీ కాలువల పూడికతీత పనులకు ప్రధాన ప్రాధాన్యతను ఇస్తూ, ప్రజలకు నేను ఏదైతే మాట ఇచ్చానో ఆ మాటకు కట్టుబడి ఒక పాలసీ తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఉండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో మూడు నాలుగు జెసిబి యంత్రాలను ప్రజలకు అందుబాటులోకి ఉంచే విధంగా కృషి చేస్తానని తెలిపారు. డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసే దాతలకు ప్రజల్లో గుర్తింపు వచ్చే విధంగా ఎక్కడి వారిని అక్కడి గ్రామాలలో సన్మానించే కార్యక్రమం చేపడతామని చెప్పారు. దీని ద్వారా దాతలకు ఇతరులకు సహాయపడ్డామన్న సంతృప్తితో పాటు, నలుగురిలో గుర్తింపు లభించిందన్న తృప్తి మిగులుతుందని చెప్పారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల కోసం చేపట్టిన పాలసీని రానున్న నెల రోజుల వ్యవధిలో ఒక షేపు కు తీసుకువస్తానని చెప్పారు.

అలాగే నియోజకవర్గ అభివృద్ధిని ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించేందుకు 15 రోజులకు ఒకసారి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఇంటరాక్షన్ అవుతానని రఘురామకృష్ణం రాజు తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధిపై పురోగతిని వివరించడం జరుగుతుందని, దాన్ని మీడియా ప్రతినిధుల ద్వారా ప్రజలకు తెలియజేయనున్నట్లు చెప్పారు. ప్రజలకు నాయకులకు మధ్య వారధిగా వ్యవహరించే మీడియాకు ఎప్పుడూ జవాబుదారిగానే ఉంటామని తెలిపారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి పెద్ద పదవులేమి అవసరం లేదని, మంత్రులంతా తెలిసినవారేనని, నియోజకవర్గ అభివృద్ధికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదన్నారు.

ఉండి పట్టణంలోని టోఫెల్ వంతెన కోసం గత వైకాపా ప్రభుత్వంలోనే అనుమతులు వచ్చినప్పటికీ, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మరోసారి రీ టెండర్ ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానించి, కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం మొదలైజేషన్ అడ్వాన్సులు ఇవ్వలేని పక్షంలో, అవసరమైతే డబ్బులు అప్పుగా ఇప్పించైనా సరే వంతెన పనులను మొదలుపెట్టిస్తానని రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

### క్షత్రియులకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తారేమో... ఇవ్వరని ఎందుకు అనుకోవాలి

రాష్ట్ర మంత్రివర్గంలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారికి స్థానం కల్పించి క్షత్రియులకు అవకాశం కల్పించక పోవడాన్ని ఎలా చూస్తారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా... త్వరలోనే ఇస్తారేమో, ఇవ్వరని ఎందుకు అనుకోవాలని రఘురామ కృష్ణంరాజు ఎదురు ప్రశ్నించారు. కచ్చితంగా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు ఓట్లు వేయకపోతే ఇంత పెద్ద విజయం సాధ్యమయ్యేది కాదన్నారు.

కూటమికి ఇంత పెద్ద విజయం అందటంలో క్షత్రియుల పాత్ర కూడా కచ్చితంగా ఎక్కువగానే ఉంది. జనాభాపరంగా క్షత్రియులు ఒక శాతం మాత్రమే ఉండవచ్చు కానీ సమాజంలోని అన్ని వర్గాల వారికి నోట్లో నాలుక మాదిరిగా వ్యవహరించే క్షత్రియులు అంటే అందరికీ గౌరవమేనని , క్షత్రియులు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అన్ని వర్గాల వారిని ప్రభావితం చేశారన్నారు.

ఇంకా సమయం ఉంది కాబట్టి ఎవరో ఒకరికి క్షత్రియ సామాజిక వర్గం నుంచి ఏదో ఒక పదవి ఇస్తారనే అనుకుంటున్నట్లు రఘురామ కృష్ణంరాజు తెలిపారు. అందరికీ ఒకేసారి పదవులు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.





# పరదాల దారిలో పూలవనం

- నాడు పరదాల జగన్.. నేడు జనం మధ్య బాబు
- నాడు జగన్ కోసం పోలీసుల పరదాలు
- రైతులు రోడ్డెక్కకుండా పోలీసుల నిర్బంధం
- జగన్‌కు అమరావతి మహిళల మోకాళ్లపై నిలబడి నిరసన
- ఇప్పుడు బాబుకు అమరావతి రైతుల బ్రహ్మరథం
- మోకాళ్లపై నిలబడి కృతజ్ఞతలు
- అమరావతిలో విచిత్రం

(మార్తి సుబ్రహ్మణ్యం)

అమరావతి రెండు విభిన్న-వింత దృశ్యాలకు కేంద్రమయింది. అపురూప దృశ్యాన్ని ఆవిష్కరించింది. ఇద్దరు నాయకులు.. రెండు భిన్న వైఖరులు.. ఒక నేతకు నిరసనలు.. మరో నేతకు నీరా'జనాలు'. ఐదేళ్ల క్రితం నిరసనలు, నిర్బంధాలు, లాఠీచార్జిలతో రణక్షేత్రాన్ని తలపించిన అమరావతి సీడ్‌యాక్సెస్ రోడ్డు.. ఇప్పుడు బంతిపూల వనంగా మారింది. తమకు దన్నుగా నిలిచిన ఆ నేతకు తలవంచి ప్రణమిల్లింది. అప్పుడు జగన్‌కు నిరసనలు ఆకాశాన్నంటితే.. ఇప్పుడు చంద్రబాబు నాయుడును, నీరాజనాలతో ఆకాశానికెత్తిన వైచిత్రి. ఈ రెండు దృశ్యాలూ అమరావతిలోవే. రెండు దృశ్యాలూ సీడ్‌యాక్సెస్ రోడ్డులోనివే. కాకపోతే నేతలే వేరు.

అమరావతిని విధ్వంసం చేసి.. రాజధాని కోసం పొలాలు ఇచ్చిన రైతుల త్యాగాలను, వికటాట్టహాసంతో వెక్కిరించిన జగన్.. అమరావతిని కాలగర్భంలో కలిపేందుకు చేయని ప్రయత్నాలు లేవు. అమరావతిని 'కమ్మ'రావతిగా మార్చి, దానిపై కులముద్ర వేసేందుకు చేయని ప్రయత్నాలు లే వు. ఉద్యమకారులను పెయిడ్ ఆర్టిస్టులుగా చిత్రీకరించారు. త్యాగాల ఫలితంగా రావలసిన కౌలు కూడా ఇవ్వకుండా, మోసం చేసిన ఘనుడిగా ముద్రపడ్డారు.

అందుకే జగన్ సచివాలయానికి వెళ్లే జగన్‌కు నిరసనలు మిన్నంటాయి. రైతులు మోకాళ్లపై నిలబడి నిరసనలు తెలిపారు. జెండాలతో వెర్రిక్కించారు. ముర్దాబాద్‌లతో భీతిత్తేలా చేశారు. జగన్.. మా ఉసురు నీకు తగలక తప్పదని శపించారు. దానితో తత్తరపడి బిత్తరపోయిన జగన్.. దారివెంట పరదాలు కట్టించుకున్నారు. తనను ఎవరూ చూడకుండా, ఎదురు రాకుండా పోలీసులతో బందోబస్తు పెట్టుకున్నారు. అడ్డువచ్చిన వారిని అడ్డంగా అరెస్టు చేయించారు.

ఇప్పుడు అధికారం మారింది. జగన్ పోయి చంద్రబాబు వచ్చారు. అమరావతి రైతుల ఉద్యమానికి దన్నుగా నిలిచి, వారి పోరాట చరిత్రను హస్తినదాకా వినిపించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు, అమరావతి రైతులు బారులుతీరి చేతు లెత్తి మొక్కారు. బంతిపూలతో ముంచెత్తారు. తమ కృతజ్ఞత లను ఆరకంగా తీర్చుకున్నారు.

జనం అభిమానించినా, ఆగ్రహించినా అంతే ఉంటుంది. జనం జోలికి వెళితే నిలిచిన వారెవరూ చరిత్రలో కనిపించరు. పైగా రైతుల జోలికి వెళితే నిలిచి గెలిచిన పాలకులెవరూ లేరు. దేశంలోనే ఉత్తమ రాజధాని నగరంలా భాసిల్లాల్సిన అమరావతిని, శిధిల రాజధానిలా మార్చిన జగన్‌కు.. అయిదేళ్లు అమరావతిని సజీవంగా ఉంచి, జాతీయ పార్టీలతో జైకొట్టించిన చంద్రబాబుకూ తేడా అదే! అందుకే జగన్‌కు శాపనార్థాలు. చంద్రబాబుకు నీరాజనాలు!



8

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 14, జూన్ 2024



## 'దేవర' గ్రాండ్ రిలీజ్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ డైరెక్షన్‌లో ఈ మూవీ అత్యద్భుతంగా, శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు.

చిత్ర యూనిట్ 'దేవర' మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేసింది. ప్రేక్షకులకు ఈ హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించటానికి దీన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. అందులో తొలి భాగం 'దేవర: పార్ట్ 1', సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలకానుంది. ఎంటైర్ ఇండియాలోని సినీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ పాన్ ఇండియా భారీ చిత్రాన్ని విడుదల చేయటానికి ఇదే కరెక్ట్ డేట్ అని మేకర్స్ భావిస్తున్నారు. తాజా రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్‌తో 'దేవర' చిత్రంపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజన్స్, కొరటాల శివ టేకింగ్‌ను ఎప్పుడెప్పుడు సిల్వర్ స్క్రీన్‌పై చూద్దామా అని అభిమానులు,ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'దేవర'గా టైటిల్ పాత్రలో మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటిస్తోన్న ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలను పోషించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ, సాబు శిరిల్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

'హరోం హర' వరల్డ్ బిల్డింగ్, బ్యాక్ డ్రాప్ చాలా ఫ్రెష్‌గా వుంటుంది

# నా క్యారెక్టర్ ఆడియన్స్‌కి గుర్తుండిపోతుంది

- హీరో సుధీర్ బాబు



హీరో సుధీర్ బాబు మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌కి సెహరి ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్స్ గా అలరిస్తున్నాయి. టీజర్, ట్రైలర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో హ్యూజ్ హైప్ క్రియేట్ చేశాయి. జూన్ 14న హరోం హర గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో సుధీర్ బాబు విలేకరుల సమావేశంలో మూవీ విశేషాలని పంచుకున్నారు. డైరెక్టర్ జ్ఞానసాగర్ సెహరి లాంటి రొమాంటిక్ కామెడీ తీశారు. రెండో సినిమాగా హరోం హర లాంటి యాక్షన్ కథ చెప్పినప్పుడు మీకు ఎలా అనిపించింది ? నేను ముందు సెహరి చూడలేదు. తను నాకు కథ చెప్పడానికి వచ్చినప్పుడు కూడా ఏదైనా లవ్ స్టోరీ చెప్తారేమో అనుకున్నాను. హరోం హర కథ చెప్పిన తర్వాత చిన్న షాక్ కి గురయ్యాను. తర్వాత సెహరి చూశాను. సెహరి తన కథ కాకపోయినా తను పుల్ చేసిన విధానం నాకు చాలా నచ్చింది. పేపర్ మీద వున్నది విజువల్ గా ప్రజెంట్ చేయడం డైరెక్టర్ మెయిన్ క్యాలిటీ. సెహరిని అలా ప్రజెంట్ చేయగలిగారు. హరోం హర వరల్డ్ బిల్డింగ్ తనకి ఇంకా ఈజీ అనిపించింది. తను కుప్పం నుంచే వచ్చారు. జనరల్ గా నాకు కథ నచ్చితే మరో ఆలోచన లేకుండా చేసేస్తాను. హరోం హర చాలా అథంటిక్ గా చేసిన కమర్షియల్ సినిమా. ఆడియన్స్ కి ఓ కొత్త వరల్డ్ చూసిన ఫీల్ వస్తుంది. ట్రైలర్ చూసి మహేష్ గారు కూడా ఇదే అన్నారు. వరల్డ్ బిల్డింగ్, బ్యాక్ డ్రాప్ ఫ్రెష్ గా వున్న సినిమాలని ప్రేక్షకులు ఇష్టపడుతున్నారని చెప్పారు. మహేష్ గారు చాలా ఎక్సయిటెడ్ గా వున్నారు. యాక్షన్ సీన్స్ చాలా బావున్నాయని చెప్పారు. సూపర్ స్టార్ కృష్ణ గారు ఎప్పుడూ యాక్షన్ క్యారెక్టర్స్ చేయమని చెప్పేవారు. ఈ సినిమా అయితే ఆయనకి చాలా నమ్మకంగా చూపించేవాడిని. 'ఇంక సెప్పేదేమ్ లేదు.. సేసేదే' అనే డైలాగ్ సినిమాలో చాలా చోట్ల వస్తుంది. దర్శకుడు ఈ కథని రాసుకున్నపుడు ఆ పిరియడ్ నుంచి కొన్ని ఇన్సిడెంట్స్ ని స్ఫూర్తిగా తీసుకున్నాడు. ఇందులో హీరో ల్యాబ్ అసిస్టెంట్. ఆ రోజుల్లో తనకి గన్ తయారు చేసే నాలెడ్జ్ వుందని చూస్తునపుడు అర్ధమైపోతుంది. 80 బ్యాక్ డ్రాప్ అథంటిసిటీని తీసుకొచ్చింది.



## షణ్ముఖ్ జస్వంత్‌తో ఎక్సయిటింగ్ న్యూ ఒరిజినల్

ట్రెమండస్ సక్సెస్ ని కొనసాగిస్తూ ఈటివి విన్ హై-క్యాలిటీ కంటెంట్ రిచ్ ఒరిజినల్ కంటెంట్‌ను రూపొందిస్తోంది. ప్రముఖ యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్‌తో ప్లాట్‌ఫారమ్ తన నెక్స్ట్ ఒరిజినల్ ని అనౌన్స్ చేసింది. ఈ న్యూ ప్రాజెక్ట్ ఆడియన్స్‌కు ఎంగేజింగ్ ఎంటర్ టైన్మెంట్ ఎక్స్ పీరియన్స్ అందజేస్తుందని ప్రామిస్ చేస్తుంది. యునిక్ స్టోరీ లైన్, షణ్ముఖ్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ తో ఈ ప్రాజెక్ట్ ఒరిజినల్ కంటెంట్ ఈటివి విన్ లైనప్‌కు ఒక అద్భుతమైన యాడ్ అన్ గా మారడానికి సిద్ధంగా ఉంది. షణ్ముఖ్ కు జోడిగా మలయాళీ హీరోయిన్ అనఘా అజిత్ నటిస్తోంది. ఈ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమంతో లాంఛనంగా ప్రారంభమైంది. నటీనటులు, టీమ్ మెంబర్స్, పరిశ్రమలోని సన్నిహితులు లాంచింగ్ ఈవెంట్ కి హాజరయ్యారు. ఈ ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. వివేక్ ఆత్రేయ స్క్రిప్ట్ హ్యాండోవర్ చేయగా, ప్రవీణ్ కాండ్రేగుల క్లాప్ ఇచ్చారు, బెక్కం వేణుగోపాల్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఫస్ట్ షాట్ కు సుబ్బు కె, అవినాష్ వర్మ గౌరవ దర్శకత్వం వహించారు.

## ఘనంగా "హనీమూన్ ఎక్స్ ప్రెస్" ప్రీ రిలీజ్

చైతన్య రావ్, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న సినిమా "హనీమూన్ ఎక్స్ ప్రెస్". ఈ చిత్రాన్ని న్యూ రీల్ ఇండియా బ్యానర్ పై కేకేఆర్, బాలరాజ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ప్రయోగాత్మకంగా ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ కామెడీ గా దర్శకుడు బాల రాజశేఖరుని రూపొందించారు. హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమా ఈ నెల 21న వరల్డ్ వైడ్ థియేటర్లలో రిలీజ్ అవుతుంది.



ఈ రోజు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు కేఎల్ ప్రసాద్ మాట్లాడుతూ - హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమా కంటెంట్ చాలా ఇన్నోవేటివ్ గా ఉంది. ఈతరం ప్రేక్షకులు బాగా ఇష్టపడే సినిమాలా ఉండబోతోంది. హీరో హీరోయిన్స్ చైతన్య రావ్, హెబ్బా పటేల్ కు, డైరెక్టర్ బాల కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నాఅన్నారు. దర్శకుడు బాల రాజశేఖరుని మాట్లాడుతూ - హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కు వచ్చి బ్లెస్ చేసిన అతిథులు అందరికీ థ్యాంక్స్. మా మూవీకి నాగార్జున గారు, అమల గారు, రాఘవేంద్రరావు గారు, ఆర్జీవీ గారు, విజయేంద్రప్రసాద్ గారు..ఇలా చాలామంది సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. నాగార్జున గారు ముందు ఈ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రమోషన్ కు అమలగారు ముందుకొచ్చారు. వారు ఇచ్చిన ఎంకరేజ్ మెంట్ తో హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమా సక్సెస్ ఫుల్ గా మీ ముందుకు తీసుకొస్తున్నాం. మనదేశం నుంచి దూరంగా ఉంటూ రావడం వల్ల ఇక్కడి ప్రజలను, కల్చర్ ను మిస్ అయ్యాను. హనీమూన్ ఎక్స్ ప్రెస్ సినిమా నేను తిరిగి మన దగ్గరకు వచ్చేందుకు ఒక వెహికిల్ లా ఉపయోగపడింది. స్టార్ హోటల్స్ లో మా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసుకోవచ్చు కానీ నేను ప్రసాద్ ల్యాబ్స్ నే సెలెక్ట్ చేసుకున్నాను. ఎందుకంటే ఇది మన తెలుగు సినిమా లెగసీని కొనసాగిస్తున్న ప్లేస్. ఇక్కడే వేలాది సినిమాలు తయారయ్యాయి. కానీ లాభాలు ది ఫుల్ మాంటీ సినిమాకే ఎక్కువ వచ్చాయి. టైటానిక్ మేకర్స్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. థియేటర్ లోకి వెళ్లాక ఒక ప్రేక్షకుడిని మెప్పించేది కంటెంట్ మాత్రమే. అలాంటి మంచి కంటెంట్ మా హనీమూన్ ఎక్స్ ప్రెస్ మూవీలో ఉంది. కల్యాణి మాలిక్ పాటలు బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. మంచి రొమాంటిక్ కామెడీ మూవీగా హనీమూన్ ఎక్స్ ప్రెస్ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుం అన్నారు.

## 'డకాయిట్'లో శ్రుతి హాసన్

అడివి శేష్ మెగా పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'డకాయిట్' హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. హీరోయిన్‌గా నటిస్తున్న శ్రుతిహాసన్ ఈ షెడ్యూల్‌లో టీమ్‌తో జాయిన్ అయింది. ఈ ఇంపార్టెంట్, మ్యాసీవ్ యాక్షన్ షెడ్యూల్‌లో మేకర్స్ లీడ్ కాస్ట్ పై కీలకమైన సన్నివేశాలు, యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా శృతి హాసన్, శేష్‌తో సెల్ఫీని షేర్ చేశారు. డకాయిట్ ఇద్దరు మాజీ ప్రేమికుల కథ, వారు తమ లైఫ్స్ ని మార్చడానికి వరుస దోపిడీలకు ఏకం కావాలి. అడివి శేష్ 'క్షణం', 'గూఢచారి'తో సహా పలు తెలుగు బ్లాక్‌బస్టర్‌లకు డివోపీగా పనిచేసిన షానీల్ డియో ఈ సినిమాతో డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. శేష్, శ్రుతి జంటగా నటిస్తున్న తొలి చిత్రం ఇది. ఈ ప్రాజెక్ట్‌ను సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ ప్రజెంట్ చేస్తోంది. హిందీ, తెలుగు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తున్నారు. అడివి శేష్, షానీల్ డియో ఈ చిత్రానికి కథ స్క్రీన్ ప్లే కూడా అందించారు.

ఈ చిత్రం 2022లో ప్రశంసలు పొందిన 'మేజర్' తర్వాత శేష్ యొక్క సెకెండ్ స్ట్రయిట్ హిందీ మూవీ. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.



## "రేవు" టైటిల్ విడుదల

వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా రేవు. ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సినిమా ప్రొడక్షన్ పర్యవేక్షకులుగా సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు.. హరినాథ్ పులి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న రేవు సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్ర వివరాలు తెలిపారు. సినిమా పర్యవేక్షకులు, సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ - ముందుగా మా మిత్రుడు పర్వతనేని రాంబాబుకు జన్మదిన శుభాకాంక్షలు. నేను గుంటూరులో ఉండగా ఒక వ్యక్తి రేవు సినిమాకు సంబంధించిన కొంత ఫుటేజ్ చూపించాడు. ఫుటేజ్ ఆసక్తికరంగా అనిపించింది. నేను హైదరాబాద్ వచ్చాక మా మిత్రుడు పర్వతనేని రాంబాబుతో రేవు మూవీ గురించి మాట్లాడాను. రాంబాబు తన మిత్రుడు, ప్రొడ్యూసర్ డాక్టర్ మురళీ గింజుపల్లి గారితో మాట్లాడారు. మా మీద నమ్మకంతో డాక్టర్ మురళీ గింజుపల్లి గారు మీరు ప్రొసీడ్ అవ్వండి అని చెప్పారు. ఆయన యూఎస్ నుంచి వచ్చిన తర్వాత రేవు సినిమా ఫస్ట్ కాపీ చూపించాం. డాక్టర్ మురళీ గింజుపల్లి గారు హ్యాపీగా ఫీలయ్యారు. సముద్రతీర ప్రాంతంలో చేపలు పట్టడమే జీవనాధారంగా బతికే మత్స్యకారుల జీవితాల్లోని సంఘర్షణ చూపించే చిత్రమిది. చాలా సహజంగా సినిమా సాగుతుంది, మూవీలో ఎమోషన్ ఆకట్టుకుంటుంది. ఆర్టిస్టుల నేచురల్ పర్ ఫార్మెన్స్ చేశారు. అజయ్, వంశీ, హేమంత్, ఆంటోనీ తమ క్యారెక్టర్స్ ను అద్భుతంగా పోషించారు. దర్శకుడు హరినాథ్ పులి చిన్న వాడైనా ఎంతో క్లారిటీగా ఆకట్టుకునేలా సినిమాను రూపొందించాడు. ఈ సినిమా చూసి ప్రొడ్యూసర్ డాక్టర్ మురళీ గింజుపల్లి గారు చాలా హ్యాపీగా ఫీలయ్యారు. మేమంతా రేవు సినిమా చూసి ఎలాంటి అనుభూతికి లోనయ్యామో...అదే అనుభూతిని రేపు మీరంతా థియేటర్ లో చూస్తూ పొందుతారు. సినిమా రిలీజ్ కు రెడీగా ఉంది. మేము రిలీజ్ డేట్ గురించి అనుకున్నాం. త్వరలోనే ఆ డేట్ అనౌన్స్ చేస్తాం. అన్నారు.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144